www.udyamakeratam.com

PRGI No. : TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 101 | 27-9-2026 | ఆదివారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |



## ఓటర్లకు ఇబ్బంది లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ

ఇంటి వద్దకే బీఎల్ఓలు, డాక్యుమెంట్ల ఆన్‌లైన్ అప్‌లోడ్!
సమగ్ర సవరణలో కీలక నిర్ణయాలు వెల్లడించిన ఎన్నికల సంఘం 4

## బంగారం కొనొద్దు మోదీ మాట వింటారా?

- అత్యవసరమైతే తప్ప పసిడి కొనుగోళ్లు తగ్గించాలని ప్రధాని పిలుపు
- విదేశీ మారక ద్రవ్యంపై ఒత్తిడి తగ్గించడమే లక్ష్యమని వివరణ

4





## సీఈసీపై పోరుకు 'ఇండియా' సమాయత్తం

- సెప్టెంబర్ 30న ఢిల్లీలో కూటమి అగ్రనేతల కీలక సమావేశం
- జ్ఞానేశ్‌కుమార్ తొలగింపు డిమాండ్‌పై ఉమ్మడి వ్యూహానికి కసరత్తు
- దేశవ్యాప్త ఆందోళనలు.. తదుపరి కార్యాచరణపై చర్చించే అవకాశం

4వ పేజీలో



## టెట్ ఫలితాలు విడుదల

- 70.07 శాతం ఉత్తీర్ణత
- టీజీటెట్ ఇన్-సర్వీస్-2026 ఫలితాలు విడుదల
- 22,477 మందిలో 15,749 మంది అర్హత

3



భారతదేశ గొప్ప రాజనీతిజ్ఞుడు, ప్రముఖ ఆర్థికవేత్త, మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు దేశ అత్యున్నత పురస్కారమైన 'భారతరత్న' అందించి గౌరవించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సరళీకృత ఆర్థిక విధానాలతో దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడంతో పాటు, ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వడంతో పాటు దేశ రాజధాని ఢిల్లీలో ఆయన జ్ఞాపకార్థం సముచితమైన విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో సర్కిల్ వద్ద హెచ్ఎమ్‌డీఏ ఆధ్వర్యంలో నిర్మించిన డాక్టర్ మన్మోహన్ సింగ్ స్మారక పార్క్‌ను, ఆయన విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఘనంగా ఆవిష్కరించారు.

# మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి!

### కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

- ఢిల్లీలో మాజీ ప్రధాని స్మారక విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్
- గచ్చిబౌలి విప్రో సర్కిల్‌లో మన్మోహన్ విగ్రహం, స్మారక పార్కు ఆవిష్కరణ
- ఆర్థిక సంస్కరణలు, రాష్ట్ర ఏర్పాటులో ఆయన పాత్రను గుర్తుచేసిన సీఎం
- మన్మోహన్ సేవలు భావితరాలకు తెలియజేయాలన్న రేవంత్

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఉద్యమ కెరటం):** మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ప్రకటించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన జ్ఞాపకార్థం దేశ రాజధాని ఢిల్లీలో సముచితమైన విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో సర్కిల్‌లో హెచ్ఎండీఏ ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని, స్మారక పార్కును ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణలు, ప్రధానమంత్రిగా అందించిన సేవలు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో ఆయన పాత్రను గుర్తుచేశారు.

మిగతా 2 లో



## నిబద్ధత గల నేత లక్ష్మణ్ బాపూజీ

నేడు ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

వివరాలు 2వ పేజీలో



## పూరిగుడిసెలు లేని రాష్ట్రం లక్ష్యం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- విడతల వారీగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు
- జనగామలో రూ.5 లక్షల చొప్పున 500 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

రాష్ట్రంలో పూరిగుడిసెలే లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హత ఉన్న ఏ పేద కుటుంబమూ ఇందిరమ్మ ఇంటి విషయంలో నిరాశ చెందాల్సిన అవసరం లేదని, విడతల వారీగా ప్రతి అర్హ కుటుంబానికి పక్కా ఇల్లు అందిస్తామని చెప్పారు. జనగామ జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా 500 మంది అర్హులకు మంజూరు పత్రాలు అందజేశారు.

వివరాలు 2వ పేజీలో

## పాతరోజులు తెస్తానని చెప్పి అదే చేశాడు..

- కరెంట్ కోతలు, యూరియా కష్టాలు
- రేవంత్ రెడ్డి 'నిజాయతీ గల మోసగాడు'
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా

3



## హైదరాబాద్ జీపీడీ స్థాయిని తగ్గించొద్దు

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానికి ఒవైసీ లేఖ 3

## అగ్రశ్రేణి పర్యాటక గమ్యంగా తెలంగాణ

- ఐదు లక్షల మందికి ఉపాధి లక్ష్యం!
- తొలి ఏడాదిలోనే రూ.22,174 కోట్ల పెట్టుబడుల ఆకర్షణ
- ఏఐ, డిజిటల్ టెక్నాలజీతో పర్యాటక రంగానికి కొత్త కళ
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి జూపల్లి

2



తెలంగాణను దేశంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన అగ్రశ్రేణి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం విప్లవాత్మక అడుగులు వేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మరియు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం-2026 సందర్భంగా హైదరాబాద్ శిల్పారామంలో శనివారం ఘనంగా నిర్వహించిన వేడుకల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు.

## కాళేశ్వరం పునరుద్ధరణ పనులు నవంబర్‌లో ప్రారంభం

- వర్షాకాలానికి ముందే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పనులు పూర్తి
- 5న సీడబ్ల్యూసీ సాంకేతిక పర్యవేక్షణ కమిటీ ముందుకు డిజైన్లు
- జాతీయ సాంకేతిక సంస్థల సూచనల మేరకే పనులు
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

2



## ఖైరతాబాద్‌లో పోటీ చేస్తాం



- నా ఫాంహౌస్ కబ్జా భూమి కాదు
- రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు గాడితప్పుతున్నాయి
- టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత

2



## నిబద్ధత గల నేత లక్ష్మణ్ బాపూజీ

### సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఉద్యమ కెరటం):** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం దశాబ్దాల పాటు నిబద్ధతతో పోరాడిన ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తిని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని ఆయన సేవలను ముఖ్యమంత్రి స్మరించు కున్నారు. తెలంగాణ ఉద్యమానికి తన ఇల్లు, ఆస్తులను సైతం అంకితం చేసిన బాపూజీ ప్రజా హక్కులు, సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేశారని చెప్పారు. బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా జీవితాంతం పనిచేసిన ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. తెలంగాణ కోసం బాపూజీ చేసిన త్యాగాలు, చూపిన మార్గం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన సేవలు శాశ్వతంగా గుర్తుండిపోయేలా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నామని గుర్తు చేశారు.

## కాళేశ్వరం పునరుద్ధరణ పనులు నవంబర్‌లో ప్రారంభం

### వర్షాకాలానికి ముందే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పనులు పూర్తి

### 5న సీడబ్ల్యూసీ సాంకేతిక పర్యవేక్షణ కమిటీ ముందుకు డిజైన్లు

### జాతీయ సాంకేతిక సంస్థల సూచనల మేరకే పనులు

### మంత్రి కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఉద్యమ కెరటం):** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల సమగ్ర పునరుద్ధరణ పనులను నవంబర్ రెండో వారంలో ప్రారంభించి 2027 వర్షాకాలానికి ముందే పూర్తి చేస్తామని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. మూడు బ్యారేజీల భద్రత పటిష్టంతోపాటు వాటి నిర్వహణ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు అవసరమైన డిజైన్లను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసిందని తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో బ్యారేజీల పునరుద్ధరణ ప్రతిపాదనలపై మంత్రి శనివారం సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు డిజైనర్ రూపొందించిన పునరుద్ధరణ ప్రణాళికలో గ్రౌటింగ్ ద్వారా పునాదులను బలోపేతం చేయడం, స్టిల్లింగ్ బేసిన్లను పొడిగించడం, కొత్తగా కట్-ఆఫ్ వాల్స్ నిర్మించడం వంటి కీలక పనులు ఉన్నాయని తెలిపారు. వరద ప్రవాహ వేగాన్ని నియంత్రించే ఏర్పాట్లలో ఉన్న లోపాలను సరిచేయడంతోపాటు పునాదుల స్థిరత్వాన్ని పెంచడం, పునాదుల కింద నీటి చౌరబాటును అరికట్టడం ఈ పనుల ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ(ఎన్‌డీఎస్ఏ)తోపాటు ఇతర నిపుణుల కమిటీలు వ్యక్తం చేసిన అభ్యంతరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని పునరుద్ధరణ ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు. బ్యారేజీల నిర్మాణ భద్రత, పునరుద్ధరణ పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. శాస్త్రీయ అధ్యయనాలు, జాతీయస్థాయి సాంకేతిక సంస్థల సిఫారసుల ఆధారంగానే ప్రతీ పని జరుగుతుంది అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపాదిత డిజైన్లను పుణేలోని కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా కేంద్రం(సీడబ్ల్యూపీఆర్ఎస్)లో కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ నమూనాల ద్వారా పరీక్షిస్తున్నట్లు తెలిపారు. వివిధ స్థాయిల్లో వరద ప్రవాహం ఉన్నప్పుడు బ్యారేజీల వద్ద నీటి ప్రవాహ తీరు ఎలా ఉంటుందో, ప్రతిపాదించిన చర్యలు ఎంత సమర్థంగా పనిచేస్తాయో ఈ పరీక్షల ద్వారా నిర్ధారిస్తారని చెప్పారు. ఖరారు చేసిన డిజైన్లను అక్టోబర్ 5న ఢిల్లీలో కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలోని సాంకేతిక పర్యవేక్షణ కమిటీ ముందు ఉంచనున్నట్లు మంత్రి వెల్లడించారు. కమిటీ నిపుణులు వాటిని పరిశీలించి అవసరమైన సూచనలు, సిఫారసులు చేస్తారని తెలిపారు. సాంకేతిక అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను ఏకకాలంలో పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పునరుద్ధరణ పనులకు సంబంధించిన సమగ్ర వ్యయ అంచనాలను నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ సిద్ధం చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ అనుమతి కోసం అవసరమైన కాంట్రాక్టు విధానాన్ని కూడా ఖరారు చేస్తున్నట్లు తెలిపారు. డిజైన్లకు అనుమతి లభించిన వెంటనే టెండర్లు పిలిచి పనులను అప్పగించేలా మొత్తం ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పనుల అమలులో కఠినమైన నాణ్యతా ప్రమాణాలు, స్వతంత్ర పరీక్షలు, స్పష్టమైన కాలపరిమితులు ఉండాలని ఆదేశించారు. నిర్ణీత గడువులో పనులు పూర్తయ్యేలా ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా సాంకేతికంగా పటిష్టమైన, దీర్ఘకాలం మన్నే విధానాలతో మూడు బ్యారేజీలను పునరుద్ధరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉత్తమ్ తెలిపారు. పునరుద్ధరణ పనులు పూర్తయి, జాతీయ సాంకేతిక సంస్థల నుంచి అవసరమైన భద్రతా అనుమతులు వచ్చిన తర్వాతే బ్యారేజీలను తిరిగి నిర్వహణలోకి తీసుకొస్తాం అని తేల్చిచెప్పారు. ఎన్‌డీఎస్ఏ ఆదేశాలను పూర్తిస్థాయిలో పాటిస్తూ, ప్రతి దశను నిపుణుల పరిశీలనకు లోబడి నిర్వహించాలని అధికారులకు సూచించారు. సమీక్షలో నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు, కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ కార్యక్రమంతో సంబంధం ఉన్న ఇంజినీర్లు పాల్గొన్నారు.



# మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి!

మొదటి పేజీ తరువాయి

మన్మోహన్ సింగ్ సేవలను గుర్తించడంలో రాజకీయాలకు తావుండకూడదని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆర్థికవేత్తగా, రాజనీతిజ్ఞుడిగా ఆయన దేశానికి అందించిన సేవలకు భారతరత్నతో గౌరవించాలని కోరారు. ఢిల్లీలో ఆయన పేరుతో విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఆర్థిక విధానాలు, ప్రజాసంక్షేమ కార్యక్రమాలపై ఆయన ఆలోచనలను భావితరాలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ రెండు అంశాలను తెలంగాణ ఎంపీలు పార్లమెంటులో ప్రస్తావించాలని సూచించారు.

### ఆర్థిక సంక్షోభం నుంచి సంస్కరణల వైపు

దేశం తీవ్ర విదేశీ మారక ద్రవ్య సంక్షోభాన్ని ఎదుర్కొన్న సమయంలో అప్పటి ప్రధానమంత్రి పీవీ నరసింహారావు నాయకత్వంలో ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ 1991లో ఆర్థిక సరళీకరణ విధానాలను ప్రవేశపెట్టారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులకు దారితీశాయని పేర్కొన్నారు. ఆర్థిక సలహాదారుగా, రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా, ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ నిర్వహించిన బాధ్యతలను ప్రస్తావించారు. హైదరాబాద్‌లో సమాచార సాంకేతిక రంగం విస్తరణకు ఆర్థిక సంస్కరణలు కూడా దోహదపడ్డాయని, అందుకే అంతర్జాతీయ సంస్థలు కొలువుదీరిన ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

### తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో మన్మోహన్ సింగ్ పోషించిన పాత్రను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. తెలంగాణ ప్రజల సుదీర్ఘ పోరాటం, అనేకమంది త్యాగాల ఫలితంగా సోనియాగాంధీ, మన్మోహన్ సింగ్ నాయకత్వంలోని అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు చర్యలు చేపట్టిందన్నారు. తెలంగాణ ఏర్పాటు బిల్లుపై మన్మోహన్ సింగ్ చేసిన సంతకం ప్రతిరూపాన్ని స్మారక పార్కులో ప్రదర్శించినట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మన్మోహన్ సింగ్ పాత్రను రాష్ట్ర ప్రజలకు గుర్తుచేసేందుకే ఈ స్మారకాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### హక్కుల చట్టాలతో ప్రజలకు భరోసా

మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో అమల్లోకి వచ్చిన సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం, గ్రామీణ ఉపాధి హామీ చట్టం, జాతీయ ఆహార భద్రత చట్టం, అటవీ హక్కుల చట్టం, భూసేకరణ-పునరావాస చట్టాలను రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. ఈ చట్టాలు ప్రజలకు వివిధ రంగాల్లో చట్టబద్ధమైన హక్కులు కల్పించడంలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు.

### భావితరాలకు స్ఫూర్తినివ్వాలనే సంకల్పం

మన్మోహన్ సింగ్ జీవితం, ప్రజాసేవ, ఆర్థిక విధానాలపై ఆయన దృక్పథాన్ని నేటి యువత తెలుసుకోవాలన్న ఉద్దేశంతో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. కొత్త తరాలకు ఆయన సేవలను పరిచయం చేయడానికి స్మారక పార్కు ఉపయోగపడుతుందన్నారు. మాజీ ప్రధానితో వ్యక్తిగత పరిచయం ఉన్న ఆర్థికవేత్త మోహన్ గురుస్వామిని ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, ఆర్థికవేత్త మోహన్ గురుస్వామి, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అరికపూడి గాంధీ, నవీన్ యాదవ్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# అగ్రశ్రేణి పర్యాటక గమ్యంగా తెలంగాణ

- ఐదు లక్షల మందికి ఉపాధి లక్ష్యం!
- తొలి ఏడాదిలోనే రూ.22,174 కోట్ల పెట్టుబడుల ఆకర్షణ
- ఏఐ, డిజిటల్ టెక్నాలజీతో పర్యాటక రంగానికి కొత్త కళ
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి జూపల్లి



**హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఉద్యమ కెరటం):** తెలంగాణను దేశంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన అగ్రశ్రేణి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం విప్లవాత్మక అడుగులు వేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మరియు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం-2026 సందర్భంగా హైదరాబాద్ శిల్పారామంలో శనివారం ఘనంగా నిర్వహించిన వేడుకల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. 'తెలంగాణ టూరిజం పాలసీ 2025-30' ద్వారా రూ.50,000 కోట్ల పెట్టుబడులు రాబట్టడం, 5 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, పాలసీ అమల్లోకి వచ్చిన తొలి ఏడాదే రూ.22,174 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు రావడం విశేషమని మంత్రి జూపల్లి తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం-2026 ఇతివృత్తమైన 'డిజిటల్ ఎజెండా అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి పునఃరూపకల్పన'కు అనుగుణంగా తెలంగాణ పర్యాటకాన్ని ప్రపంచ వేదికపై నిలిపేందుకు అత్యాధునిక ఏఐ సాంకేతికతను ఉపయోగిస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లోని చారిత్రక కట్టడాల నుంచి యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, యాదాద్రి, భద్రాచలం, నల్లమల అడవులు, జలపాతాల వరకు సరైన రీతిలో గ్లోబల్ మార్కెటింగ్ చేయాలని సూచించారు. ఐటీ ఉద్యోగులు వారాంతాల్లో పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా ప్రత్యేక కూపన్లు, హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలను (వికారాబాద్) ప్రోత్సహిస్తున్నామని, పీపీపీ విధానంలో మౌలిక వసతులు పెంచుతున్నామని ఆయన స్పష్టం చేశారు. పర్యాటక రంగంలో సరికొత్త ప్రయోగంగా 'రివర్స్ టూరిజం-ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్' కు శ్రీకారం చుట్టామని మంత్రి జూపల్లి తెలిపారు. దీనివల్ల అడవి బిడ్డలు నగరాల్లోని ఆధునిక అభివృద్ధిని, చారిత్రక వైభవాన్ని ప్రత్యక్షంగా సందర్శించే అవకాశం లభిస్తుందన్నారు. ఈ వేడుకల్లో భాగంగా పునర్ రూపకల్పన చేసిన 'తెలంగాణ టూరిజం వెబ్‌సైట్', ఆన్‌లైన్ హోమ్‌స్టే రిజిస్ట్రేషన్ పోర్టల్, కాఫీ టేబుల్ బుక్, ఏఆర్/వీఆర్ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, నూతన టూరిజం ట్రైలర్లను డిప్యూటీ సీఎం, పర్యాటక మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అలాగే ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, రాష్ట్ర పురావస్తు శాఖల మధ్య ఎంఓయూ (వీశీఖ) కుదిరింది. పర్యాటక రంగంలో ప్రతిభ కనబరిచిన వారికి ఎక్సలెన్స్ అవార్డులు ప్రదానం చేసిన ఈ కార్యక్రమంలో శాఖాధిపతులు, సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

# పూరిగుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- విడతల వారీగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు
- జనగామలో రూ.5 లక్షల చొప్పున 500 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ



**జనగామ, సెప్టెంబర్ 26 (ఉద్యమ కెరటం):** రాష్ట్రంలో పూరిగుడిసెలు లేని తెలంగాణను ఆవిష్కరించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, విడతల వారీగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి తదితరులతో కలిసి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని తెలంగాణ రాష్ట్ర గీతావళిని ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

### దసరా నాటికి 2.18 లక్షల ఇళ్లు పూర్తి

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రతికూలంగా ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున సహాయం అందిస్తున్నామని, రాబోయే దసరా నాటికి 2.18 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు వేగంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిర్మాణ దశలను బట్టి ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నామన్నారు. రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లు కేటాయించామని, ప్రతి నియోజకవర్గానికి అదనంగా 2,000 ఇళ్లను అందిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ప్రాధాన్యత క్రమంలో జనగామ నియోజకవర్గంలోని 500 పూరిళ్ల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఈ వేదికపై నుంచే సహాయం అందిస్తున్నామని వెల్లడించారు.

### అసంపూర్తి ఇళ్లకు ఆర్థిక సాయం..

గత ప్రభుత్వ హయాంలో స్లాబ్, మొండిగోడల స్థాయిలో అసంపూర్తిగా ఆగిపోయిన ఇళ్లను పూర్తి చేసుకునేందుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించే వెసులుబాటును రెండో విడతలో కల్పిస్తున్నామని మంత్రి ప్రకటించారు. అలాగే జనగామలో నివాసయోగ్యంగా లేని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మరమ్మతులకు వెంటనే రూ.2 కోట్లు మంజూరు చేస్తున్నామని, దసరా నాటికి వీటిని లబ్ధిదారులకు అందిస్తామన్నారు. జనగామ మున్సిపాలిటీ మౌలిక వసతుల కోసం రూ.25 కోట్లు తక్షణమే కేటాయిస్తున్నామని, పాత అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాలకు ఇప్పటివరకు రూ.70 వేల కోట్లకు పైగా సున్నా వడ్డీ రుణాలు ఇచ్చామని, ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో అంతర్జాతీయ స్థాయి ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థలను నిర్మిస్తున్నామని వివరించారు.

### ప్రజా సంక్షేమమే ధ్యేయం: ప్రజాప్రతినిధులు

భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసిందన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న బైపాస్ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనులు, నీటి పంపుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం 500 మంది అర్హులైన లబ్ధిదారులకు మంత్రి, ప్రజాప్రతినిధులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పాతరోజులు తెస్తానని చెప్పి అదే చేశాడు..

- కాంగ్రెస్ రాగానే కరెంట్ కోతలు, యూరియా కష్టాలు
- రేవంత్ రెడ్డి 'నిజాయతీ గల మోసగాడు'
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఉద్యమ కెరటం):** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ ప్రజలకు గోస తప్పదని గులాబీ అధినేత కేసీఆర్ ఎన్నికలకు ముందే హెచ్చరించారని, పాతరోజులు తెస్తానని ఎన్నికల్లో చెప్పిన రేవంత్ రెడ్డి నిజంగానే రాష్ట్రాన్ని దశాబ్దాలు వెనక్కి తీసుకెళ్లి ఆ పని చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా వెనుకబడిపోయిందని ఆయన విమర్శించారు. శనివారం తెలంగాణ భవన్‌లో మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సత్తూరి యాదగిరి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కేసీఆర్ పాలనలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందుబాటులో ఉండేదని, కానీ కాంగ్రెస్ రాగానే కరెంట్ కోతలు, యూరియా కోసం రైతులు క్యూలైన్లలో అష్టకష్టాలు పడే పరిస్థితులు మళ్లీ వచ్చాయని కేటీఆర్ దుయ్యబట్టారు. కేసీఆర్‌ను బయటికి రావాలని, అసెంబ్లీకి రావాలని డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్ నేతలకు సమాధానమిస్తూ.. "కేసీఆర్ ప్రత్యేకంగా బయటికి రావాల్సిన పనిలేదు, ఆయన తెలంగాణ ప్రజల గుండెల్లోనే ఉన్నారు" అని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని 'నిజాయతీ గల మోసగాడు'గా అభివర్ణించిన కేటీఆర్.. ప్రజలు పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారనే చందంగా రాష్ట్ర పరిస్థితి తయారైందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో రైతులు నాట్లు వేసే సమయానికే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడేవని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధు ఇవ్వకుండా రైతులను మోసం చేసిందని ఆరోపించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలతో పాటు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పి ఓట్లు వేయించుకుని ఇప్పుడు చేతులెత్తేశారని, ప్రజల పరిస్థితి 'అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోయినట్లు' తయారైందన్నారు. 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిస్తూ, సెప్టెంబర్ 28 నుంచి ప్రారంభమయ్యే పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో బీఆర్ఎస్ శ్రేణులు క్రియాశీలకంగా పాల్గొనాలని కోరారు.



# ఖైరతాబాద్‌లో పోటీ చేస్తాం

**నా ఫాంహౌస్ కబ్జా భూమి కాదు**

**నా ఆస్తుల ప్రతి వివరం అఫిడవిట్‌లో క్లియర్‌గా ఉంది**

**రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు గాడితప్పుతున్నాయి**

**టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఉద్యమ కెరటం):** ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నిక బరిలో తాము నిలవబోతున్నట్లు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ తరఫున అధికారికంగా అభ్యర్థిని బరిలోకి దింపనున్నట్లు ఆమె ప్రకటించారు. ఇదే సమయంలో ఫిరాయింపు రాజకీయాలపై మండిపడిన ఆమె... ఒక పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి, వేరే పార్టీలోకి వెళ్లి ఎంపీగా పోటీ చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని దానం నాగేందర్ తీరును పరోక్షంగా తప్పుబట్టారు. ఇక కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణపై స్పందిస్తూ... కేవలం క్లరికల్ తప్పుల పేరుతో ఓట్లు తొలగిస్తున్నారనే విమర్శలున్నాయని, బీజేపీని ప్రసన్నం చేసుకునేలా ఈ కుట్ర జరుగుతోందన్న చర్చ ప్రజల్లో నడుస్తోందని ఆమె ఆరోపించారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో వరుసగా చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు గాడితప్పుతున్నాయని, ప్రభుత్వం వాటిని తక్షణమే చక్కదిద్దాలని డిమాండ్ చేశారు. నిమ్స్, నీలోఫర్ వంటి పెద్ద ఆసుపత్రులలో మంత్రులు స్వయంగా ఫోన్ చేసినా బెడ్లు దొరకని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 11 రకాల ఆరోగ్య పథకాలకు కనీస బడ్జెట్ కేటాయించలేదని, ఆరోగ్యశ్రీ బకాయిలను కూడా ఇప్పటివరకు విడుదల చేయలేదని దుయ్యబట్టారు. ప్రభుత్వ ఆసుపత్రులను మంత్రులు పట్టించుకోవడం మానేశారని విమర్శించిన కవిత... జిల్లాల కలెక్టర్లు క్రమం తప్పకుండా హాస్టళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేయాలని సూచించారు. తాము కూడా తెలంగాణ రక్షణ సేన తరఫున ప్రతి జిల్లాలోనూ ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించి పరిస్థితులను మదింపు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఇన్ని పసిమొగ్గలు రాలిపోతుంటే... తెలంగాణను సింగపూర్, డల్లాస్ చేస్తామని సీఎం, మంత్రులు ఎలా గొప్పలు చెప్పుకుంటారని నిలదీశారు. ఐటీడీఏకు కేంద్రం నుంచి వచ్చిన నిధుల్లో ఏకంగా 70 శాతం నిధులను ఖర్చు చేయకుండా వృథా చేశారని ఆరోపించారు. కోఠి ఆసుపత్రిలో మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తామన్న ప్రతిపాదనను గత బీఆర్ఎస్ హయాంలోనే అడ్డుకున్నారని గుర్తుచేశారు. తన ఫామ్‌హౌస్‌పై వస్తున్న ఆరోపణలను కవిత పూర్తిగా ఖండించారు. తనది ఎలాంటి కబ్జా భూమి కాదని, ఇనాం లేదా అసైన్డ్ భూమి అంతకంటే కానేకాదని స్పష్టం చేశారు. తన ఫామ్‌హౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలో కూడా లేదని స్పష్టం చేస్తూ... తన ఆస్తులకు సంబంధించిన ప్రతి వివరమూ ఎన్నికల అఫిడవిట్లోనే స్పష్టంగా పేర్కొన్నట్లు వెల్లడించారు. ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై, ఇతర ప్రతిపక్ష నేతలపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల ఫామ్‌హౌస్‌లకు వెళ్లిన పెద్దలు అప్పట్లో ఎందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె ప్రశ్నించారు.

# ఏసీబీకి చిక్కిన మెట్‌పల్లి సీడీపీవో

**అంగన్ వాడీ కేంద్రాల నుంచి లంచం తీసుకుంటుండగా ..**

**మెట్‌పల్లి, సెప్టెంబర్ 26:** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి సీడీపీఓ దారోజు పద్మ రూ.63 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. శుక్రవారం కార్యాలయ ఆవరణ వెలుపల ఫిర్యాదుదారు నుంచి లంచం తీసుకుంటుండగా ఆదిలాబాద్ ఇన్‌చార్జి ఏసీబీ డీఎస్పీ గొర్రె మధు ఆధ్వర్యంలోని అధికారులు రెడ్ హ్యాం డెడ్గా పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి రూ.63 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. మెట్పల్లి మండల పరిధిలోని 21 అంగన్వాడీ కేంద్రాల నుంచి ఒక్కో కేంద్రానికి నెలకు రూ.1,000 చొప్పున మూడు నెలలకు రూ.3,000గా మొత్తం రూ.63 వేలు లంచంగా డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. అంగన్వాడీ కేంద్రాల తనిఖీల్లో ప్రతికూల అంశాలు నమోదు చేయకుండా ఉండేందుకు ఈ మొత్తాన్ని డిమాండ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. సీడీపీఓను అరెస్టు చేసి కరీంనగర్ లోని ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు ఏసీబీ జాయింట్ డైరెక్టర్ తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, ఫిర్యాదు దారుడి వివరాలను భద్రతా కారణాలతో గోప్యంగా ఉంచినట్లు వెల్లడిం చారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే 1064 టోల్ ఫ్రీ నంబర్కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు సూచించారు. అలాగే 9440446106 వాట్సాప్ నంబర్ ద్వారా కూడా సమాచారం అందించవచ్చని తెలిపారు.





# టెట్ ఫలితాలు విడుదల

**70.07 శాతం ఉత్తీర్ణత**

**టీజీటెట్ ఇన్-సర్వీస్-2026 ఫలితాలు విడుదల**

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఉద్యమ కెరటం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ, ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేస్తున్న ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన టీజీటెట్-ఇన్‌సర్వీస్ టీచర్స్-2026 ఫలితాలు విడుదలయ్యాయి. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, టీజీటెట్ ఛైర్‌పర్సన్ శనివారం ఫలితాలను విడుదల చేశారు. జులై 21న విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం సెప్టెంబర్ 8, 9 తేదీల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహించారు. మూడు విడతల్లో ఆన్‌లైన్ పరీక్షలు జరిగాయి. మొత్తం 24,986 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 22,477 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 15,749 మంది అర్హత సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా 70.07 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పేపర్-1లో 4,942 మంది పరీక్షకు హాజరుకాగా.. 3,398 మంది (68.76%) అర్హత సాధించారు. పేపర్-2 గణితం, సైన్స్ విభాగంలో 9,131 మంది పరీక్ష రాశారు. వీరిలో 6,720 మంది (73.60%) ఉత్తీర్ణులయ్యారు. పేపర్-2 సోషల్ స్టడీస్‌లో 8,404 మంది పరీక్షకు హాజరుకాగా.. 5,631 మంది (67%) అర్హత సాధించారు. అభ్యర్థులు తమ ఫలితాలతో పాటు మార్కుల వివరాలను పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సమీపంలోని మీ-సేవ కేంద్రాల్లోనూ మార్కుల వివరాలను పొందవచ్చని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

# హైదరాబాద్ జీపీఓ స్థాయిని తగ్గించొద్దు..

**కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానికి ఒవైసీ లేఖ**



**హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఉద్యమ కెరటం):** హైదరాబాద్ నగరానికి చారిత్రక వారసత్వంగా ఉన్న హైదరాబాద్ జనరల్ పోస్టాఫీస్ (జీపీఓ) హోదాను తగ్గించాలన్న ప్రతిపాదనను తాము వ్యతిరేకిస్తున్నట్లు ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. ఈ ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని కోరుతూ కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాలకు ఆయన శనివారం లేఖ రాశారు. హైదరాబాద్ జీపీఓను గ్రూప్ 'ఏ' నుంచి గ్రూప్ 'బీ'కి మార్చడంతో పాటు, హైదరాబాద్ సిటీ డివిజన్‌లో విలీనం చేయాలని ఇటీవల వచ్చిన ప్రతిపాదన సరికాదంటూ ఒవైసీ తన లేఖలో ప్రస్తావించారు. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న ఈ సంస్థ హోదాను తగ్గించడం అన్యాయమని, ఏకపక్ష నిర్ణయమని ఆయన అభిప్రాయపడ్డారు. జీపీఓ ఉద్యోగుల నుంచి తనకు అందిన వినతిపత్రాన్ని కూడా ఈ లేఖకు జతపరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జీపీఓ ప్రాముఖ్యతను ఒవైసీ వివరించారు. "హైదరాబాద్ జీపీఓ అత్యధిక పనిభారం కలిగిన ముఖ్యమైన సంస్థ. హైదరాబాద్ హెడ్ పోస్టాఫీస్ పరిధిలోని మొత్తం మెయిల్ కార్యకలాపాల్లో జీపీఓ వాటా గణనీయంగా ఉంది. దీని డెలివరీ పరిధి కూడా నిరంతరం విస్తరిస్తోంది. అంతేకాకుండా, తెలంగాణ రాష్ట్రంలో ఏకైక ఫిలాటెలిక్ బ్యూరో (తపాలా స్టాంపుల సేకరణ, పోస్టల్ చరిత్ర పరిశోధన) ఇక్కడే ఉంది" అని ఆయన పేర్కొన్నారు. తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఈ చారిత్రక సంస్థకు మహానగరంలో ఎంతో ప్రాధాన్యత ఉందని, లక్షలాది మందికి తపాలా సేవలు అందిస్తోందని ఒవైసీ గుర్తుచేశారు. ప్రజల ప్రయోజనాలను, సంస్థ వారసత్వ గుర్తింపును దృష్టిలో ఉంచుకుని, కేంద్ర మంత్రులు ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జీపీఓ హోదా తగ్గింపు, విలీనం ప్రతిపాదనలను రద్దు చేసి, చీఫ్ పోస్ట్‌మాస్టర్ ఆధ్వర్యంలో స్వతంత్ర గ్రూప్ 'ఏ' సంస్థగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# రైతులను రాజులను చేయడమే 'రైతు బడి' లక్ష్యం

**మాజీ మంత్రి హరీశ్ రావు**

**ఎల్బీనగర్, సెప్టెంబర్ 26:** సాధారణ పాఠశాలలు ఉత్తమ పౌరులను తయారు చేస్తే రైతులను నిజంగా రాజులను చేయాలనే మహత్తర లక్ష్యంతో రైతు బడి ఏర్పడిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు తెలిపారు. ఎల్బీ నగర్ చిత్రా లేఅవుట్‌లో శనివారం నిర్వహించిన 'రైతు బడి గ్రూప్' గ్రాండ్ లాంచ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. డిజిటల్ యుగంలో ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చినప్పటికీ వ్యవసాయ రంగంలో రావాల్సినంత పురోగతి ఇంకా రాలేదన్నారు. ఆ లోటును భర్తీ చేస్తూ రైతులకు అవసరమైన టెక్నాలజీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, లాభదాయక పంటలు, మార్కెటింగ్ సమాచారాన్ని అందించే ఒక అనుసంధాన వేదికగా రైతు బడి నిలుస్తుందని ఆకాంక్షించారు. ఇక్కడ రైతులే ఉపాధ్యాయులని, వారి క్షేత్రస్థాయి అనుభవాలే పాఠాలని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో కుంకుడు కాయల సాగు ద్వారా ఆదాయం పొంది మార్గదర్శకంగా నిలిచిన పద్మనాభం ఉదాహరణను ఆయన గుర్తుచేశారు. పంటల వారీగా, జిల్లాల వారీగా 30 యూట్యూబ్ ఛానళ్లు, ఒక మ్యాగజైన్ ప్రారంభించి 30 లక్షల మంది వీక్షకులకు చేరువైన నిర్వాహకుడు రాజేంద్ర ప్రయత్నాన్ని హరీశ్‌రావు ప్రత్యేకంగా అభినందించారు. సిద్ధిపేట ప్రాంతంలో తాను స్వయంగా చొరవ తీసుకుని వేలాది ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు ప్రోత్సహించానని, నాలుగైదేళ్ల వ్యవధిలోనే రైతులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల కంటే మెరుగైన ఆదాయాన్ని ఆర్జిస్తున్నారని తెలిపారు. రైతుల్లో కొత్త విషయాలు నేర్చుకోవాలనే తపన చాలా ఉందన్న హరీశ్ రావు రైతు బడి ద్వారా వారికి సరైన మార్గదర్శకత్వం లభిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. సంపూర్ణ మద్దతు తెలపడమే కాక ఈ సంస్థ మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

# నేషన్ ఫస్ట్.. మా సిద్ధాంతం

- గాంధీ పరివారానికి బానిసత్వం కాంగ్రెస్ నైజం
- బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు



**హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఉద్యమ కెరటం):** భారత దేశంలో రాబోయే రాజకీయ పోరు గాంధీ పరివార్ వర్సెస్ సంఘ్ పరివార్ అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. ఆయన వ్యాఖ్యలే కాంగ్రెస్ నడిపే కుటుంబ స్వార్థ రాజకీయాలకు, సంఘ్ పరివార్ నమ్ముకున్న నిస్వార్థ దేశ భక్తికి మధ్య ఉన్న తేడా ఏంటో ప్రజలకు స్పష్టం చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాజకీయం అంటే ఒకే ఒక్క కుటుంబంతో మొదలవుతుంది.. ఆ కుటుంబంతోనే ముగుస్తుందని తెలిపారు. కానీ తమకు ఏ ఒక్క వ్యక్తి లేదా కుటుంబం కంటే దేశ ప్రయోజనాలే ఎల్లప్పుడూ ముఖ్యం అని స్పష్టం చేశారు. దేశంపై ఎమర్జెన్సీ రుద్ది ప్రజల గొంతు నొక్కింది, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది కాంగ్రెస్ కాదా అని నిలదీశారు. 1984లో దేశ రాజధాని నడిబొడ్డున వేలాదిమంది అమాయక సిక్కులను ఊచకోత కోసిన రక్తచరిత్ర కాంగ్రెస్ పాలనలోనే జరిగిందని గుర్తు చేశారు. 26/11 ముంబైపై పాకిస్థాన్ ఉగ్రవాదులు దాడి చేసి భారత ప్రజలను పొట్టనబెట్టుకుంటే కనీసం పాకిస్థాన్‌పై ఎదురుదాడి చేసే ధైర్యం లేక చేతులెత్తేసింది కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కార్ అని ఆయన విమర్శించారు. చివరకు 2013 నాటికి మన దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే అత్యంత బలహీనమైన ఐదు దేశాల సరసన నిలబెట్టిన ఘనత కూడా కాంగ్రెస్ పాలనదేనన్నారు. సంఘ్ పరివార్ ఏ ఒక్కరి ఇంటిపేరు మీదో, ఒక కుటుంబం వారసత్వం మీదో నడిచేది కాదని, ఎలాంటి పదవులు, పేర్లు ఆశించకుండా కేవలం సమాజ సేవ, దేశ నిర్మాణం, క్రమశిక్షణ కోసం జీవితాలను త్యాగం చేసిన తరతరాల కార్యకర్తల త్యాగాలతో నిలబడిన వ్యవస్థ అని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న పోలిక అర్థంపర్థంలేనిదని కొట్టిపడేశారు. దిల్లీ గాంధీ కుటుంబం కాళ్ల దగ్గర పడి తన బానిసత్వాన్ని నిరూపించుకోవడానికి రేవంత్ రెడ్డి ఎంతైనా పాకులాడవచ్చు.. కానీ ప్రజలు కోరుకుంటున్నది కుటుంబ పాలన కాదు.. ప్రజా సంక్షేమం, వంశపారపర్య పెత్తనం కాదు.. దేశ ప్రయోజనాలు అని రామచందర్‌రావు స్పష్టం చేశారు.



# చైనాకు బైబై..

## భారత్ వైపు 'డేటా హైవే'!

**సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుళ్లకు మారుతున్న ప్రపంచ మార్గాలు**

**దక్షిణ చైనా సముద్రం, ఎర్ర సముద్రంపై ఆధారాన్ని తగ్గిస్తున్న టెక్ సంస్థలు**

**హిందూ మహాసముద్రం మీదుగా కొత్త కేబుల్ మార్గాలపై పెరుగుతున్న ఆసక్తి**

**ముంబైకి తోడుగా అంతర్జాతీయ అనుసంధాన కేంద్రంగా ఎదుగుతున్న చెన్నై**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 (ఉద్యమ కెరటం):** ప్రపంచ డిజిటల్ పటంలో భారత్ ప్రాధాన్యం మరింత పెరుగుతోంది. అంతర్జాతీయ ఇంటర్నెట్ సమాచారంలో అత్యధిక భాగాన్ని మోసుకెళ్లే సముద్రగర్భ కేబుళ్లకు కొత్త మార్గాలు రూపుదిద్దుకుంటున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సముద్ర మార్గాల్లో భద్రతాపరమైన సమస్యలు, అనుమతుల్లో జాప్యాల నేపథ్యంలో కొన్ని అంతర్జాతీయ కేబుల్ ప్రాజెక్టులు దక్షిణ చైనా సముద్రం, ఎర్ర సముద్రంపై ఆధారాన్ని తగ్గించే ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తున్నాయి. ఈ మార్పులో భారత్, ముఖ్యంగా ముంబై, చెన్నై నగరాలు కీలక అనుసంధాన కేంద్రాలుగా ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. దేశాల మధ్య ప్రయాణించే అంతర్జాతీయ డేటాలో అత్యధిక భాగం సముద్రగర్భ ఫైబర్ ఆప్టిక్ కేబుళ్ల ద్వారానే వెళ్తుంది. ఉపగ్రహాలు ఇంటర్నెట్ అనుసంధానంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, భారీ స్థాయిలో డేటాను వేగంగా, తక్కువ ఆలస్యంతో తరలించడంలో సముద్రగర్భ కేబుళ్లే ప్రధాన ఆధారం. ప్రపంచ బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలు, క్లౌడ్ సేవలు, వీడియో ప్రసారాలు, ప్రభుత్వ సమాచార వ్యవస్థలు వీటిపైనే పెద్దఎత్తున ఆధారపడి ఉన్నాయి. ఇటీవలి కాలంలో ఎర్ర సముద్ర ప్రాంతంలో భద్రతాపరమైన సమస్యలు, కేబుళ్లకు జరిగిన నష్టాలు ప్రపంచ డిజిటల్ మౌలిక వసతుల బలహీనతలను మరోసారి బయటపెట్టాయి. మరోవైపు అమెరికా–చైనా మధ్య సాంకేతిక, భద్రతాపరమైన పోటీ నేపథ్యంలో దక్షిణ చైనా సముద్రం మీదుగా వెళ్లే కొన్ని కొత్త కేబుల్ ప్రాజెక్టుల మార్గాల విషయంలోనూ పునరాలోచనలు జరుగుతున్నాయి. అయితే ప్రపంచ కేబుళ్లన్నీ చైనా మార్గాన్ని విడిచిపెడుతున్నాయని చెప్పడం కంటే, ప్రత్యామ్నాయ మార్గాల నిర్మాణం వేగం పుంజుకుంటోందని చెప్పడమే సముచితం. హిందూ మహాసముద్రానికి మధ్యలో ఉన్న భౌగోళిక స్థానం భారత్‌కు ప్రధాన బలంగా మారుతోంది. ఆసియా, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా, ఐరోపా ప్రాంతాలను అనుసంధానించే కొత్త సముద్రగర్భ కేబుళ్లలో భారత తీర నగరాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఇప్పటివరకు ముంబై ప్రధాన కేబుల్ ల్యాండింగ్ కేంద్రంగా ఉండగా, చెన్నై కూడా వేగంగా కీలక డిజిటల్ ద్వారంగా ఎదుగుతోంది. దీంతో దేశంలో డేటా కేంద్రాలు, క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ సేవలకు అవసరమైన అంతర్జాతీయ అనుసంధానం మరింత విస్తరించే అవకాశం ఉంది. ఒకే మార్గంపై ఆధారపడకుండా అనేక కేబుళ్లు అందుబాటులోకి రావడం వల్ల నెట్‌వర్క్ స్థిరత్వం కూడా పెరుగుతుంది. కృత్రిమ మేధ, భారీ డేటా కేంద్రాలు, క్లౌడ్ సేవలు, సూపర్ కంప్యూటింగ్ విస్తరణతో ప్రపంచవ్యాప్తంగా డేటా రవాణా అవసరాలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సముద్రగర్భ కేబుళ్లు కేవలం ఇంటర్నెట్ సదుపాయంగా కాకుండా దేశాల ఆర్థిక, వ్యూహాత్మక మౌలిక వసతుల్లో కీలక భాగంగా మారుతున్నాయి. ఒక సముద్రగర్భ కేబుల్ తెగినంత మాత్రాన సాధారణంగా మొత్తం ఇంటర్నెట్ నిలిచిపోదు. ప్రత్యామ్నాయ కేబుళ్లు అందుబాటులో ఉంటే డేటా ట్రాఫిక్‌ను వాటివైపు మళ్లిస్తారు. ఒక కేబుల్ విఫలమైనా సేవలు కొనసాగేలా ప్రధాన నెట్‌వర్క్‌లు అనేక మార్గాలను ఉపయోగిస్తాయి. అయితే తక్కువ కేబుల్ అనుసంధానం ఉన్న ప్రాంతాల్లో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ప్రధాన కేబుల్ దెబ్బతింటే ఇంటర్నెట్ వేగం తగ్గడం, కొన్ని సేవలకు అంతరాయం ఏర్పడటం సాధ్యమే. ప్రత్యామ్నాయ మార్గమే లేని ప్రాంతాల్లో ప్రభావం మరింత తీవ్రంగా ఉండొచ్చు. అత్యవసర పరిస్థితుల్లో ఉపగ్రహ అనుసంధానం కొంతవరకు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది. కొత్త సముద్రగర్భ కేబుళ్లు భారత్‌ను తాకడం వల్ల కేవలం ఇంటర్నెట్ వేగమే కాదు.. డేటా కేంద్రాలు, క్లౌడ్ సేవలు, కృత్రిమ మేధ రంగాల్లో పెట్టుబడులు పెరిగేందుకు అవకాశాలు ఏర్పడతాయి. ముంబై, చెన్నై వంటి నగరాలు మరిన్ని అంతర్జాతీయ కేబుళ్లకు కేంద్రాలుగా మారితే ప్రపంచ డిజిటల్ వ్యవస్థలో భారత్ పాత్ర మరింత కీలకం కానుంది.

## అస్సాంలో సర్ బాధితులను కలుస్తా: అశుతోష్ రంకా



**ఢిల్లీ, సెప్టెంబర్ 27 :** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కోకన్వీనర్ అశుతోష్ రంకా అస్సాంలో పర్యటిస్తున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) బాధితులతో మాట్లాడతానని ఆయన తెలిపారు. శనివారం గువహటిలో మీడియాతో ఆయన మాట్లాడారు. సర్ ప్రక్రియ కారణంగా అస్సాంలో చాలా మంది ఓటు హక్కును కోల్పోయారని, అలాంటి వారిని కలిసి మాట్లాడతానని చెపక్పారు. అలాగే ఆదివారం స్కూళ్లను కూడా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తానన్నారు. ఇందుకోసం తమ వలంటీర్లు ఏర్పాటు్ల చేస్తున్నారని తెలిపారు. 'అస్సాంలో మాకు చాలా మంది వలంటీర్లు ఉన్నారు. వారితో కలిసి అస్సాం స్కూళ్లను పరిశీలిస్తా. తర్వాత వలంటీర్లతో భేటీ అవుతా' అని అశుతోష్ పేర్కొన్నారు.

**ఈశాన్య రాష్ట్రాల్లో సీజేపీకి ఆదరణ**

అస్సాంతో పాటు మిగతా ఈశాన్య రాష్ట్రాల్లోనూ తమ పార్టీ సీజేపీకి ఆదరణ పెరుగుతోందని అశుతోష్ అన్నారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తమ పార్టీ నిర్వహించిన ఆందోళన కార్యక్రమాల్లో అస్సాం నుంచి అద్భుతమైన స్పందన వచ్చిందని, అస్సాం ప్రజలు తమ ఆందోళనకు సంఘీభావం తెలిపారని ఆయన వెల్లడించారు. అస్సాం, ఇతర ఈశాన్యా రాష్ట్రాల్లో సీజేపీ చాలా వేగంగా విస్తరిస్తోందన్నారు. తమ పార్టీని ప్రారంభించినప్పటి నుంచి అస్సాం ప్రజలు తమకు మద్దతు ఇస్తూనే ఉన్నారని వివరించారు. త్వరలో అస్సాంతో పాటు మిగతా ఈశాన్యా రాష్ట్రాల్లోనూ రాష్ట్ర యూనిట్లను ప్రకటిస్తామని అశుతోష్ తెలిపారు. మెరుగైన భారత్ కోసం కృషి చేయడం, జవాబుదారీతనం తేవడం, విద్యా వ్యవస్థను ప్రక్షాళించడమే తమ పార్టీ లక్ష్యం అని ఆయన చెప్పారు.

# సీఈసీపై పోరుకు 'ఇండియా' సమాయత్తం

- సెప్టెంబర్ 30న ఢిల్లీలో కూటమి అగ్రనేతల కీలక సమావేశం
- జ్ఞానేశ్‌కుమార్ తొలగింపు డిమాండ్‌పై ఉమ్మడి వ్యూహానికి కసరత్తు
- దేశవ్యాప్త ఆందోళనలు.. తదుపరి కార్యాచరణపై చర్చించే అవకాశం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 (ఉద్యమ కెరటం):** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలన్న డిమాండ్‌పై ఉమ్మడి కార్యాచరణ రూపొందించేందుకు ప్రతిపక్ష 'ఇండియా' కూటమి సమాయత్తమవుతోంది. సెప్టెంబర్ 30న న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో కూటమి కీలక సమావేశం నిర్వహించనుంది. జ్ఞానేశ్‌కుమార్ తొలగింపునకు పార్లమెంటులో తీర్మానం తీసుకురావడం సహా అనుసరించాల్సిన వ్యూహంపై సమావేశంలో చర్చించే అవకాశం ఉందని తాజా కథనాలు పేర్కొన్నాయి. చీఋఎ కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సీపీఎం సహా కూటమి భాగస్వామ్య పార్టీల అగ్రనేతలు సమావేశానికి హాజరయ్యే అవకాశం ఉంది. తృణమూల్ కాంగ్రెస్ నేత మమతా బెనర్జీ ఇప్పటికే కాంగ్రెస్ నాయకత్వంతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీతోనూ చర్చలు జరిగినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. సమావేశం అనంతరం ఉమ్మడి కార్యాచరణను ప్రకటించే అవకాశం ఉంది.

**తొలగింపు తీర్మానంపై కసరత్తు**

ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలన్న డిమాండ్‌ను మరింత ముందుకు తీసుకెళ్లడమే సమావేశంలోని ప్రధాన అంశాల్లో ఒకటిగా ఉండనుంది. ఇందుకు అవసరమైన రాజకీయ, పార్లమెంటరీ కార్యాచరణతోపాటు సంతకాల సేకరణపైనా చర్చ జరిగే అవకాశం ఉందని కథనాలు పేర్కొన్నాయి. ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై అభ్యంతరాలు, ఎన్నికల సంఘం పనితీరుపై ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న అంశాలు, దేశవ్యాప్త నిరసనల నిర్వహణ కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది.

**14 అభ్యంతరాలతో రాజుకున్న వివాదం**

ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో ఓటర్ల జాబితాల చేర్పులు, తొలగింపులు, సమాచార నిర్వహణ తదితర అంశాలకు సంబంధించి కనీసం 14 సందర్భాల్లో అభ్యంతరాలు నమోదు చేశారని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పరిశోధనాత్మక కథనం వెల్లడించింది. ఈ కథనం వెలువడిన తర్వాత ఎన్నికల సంఘం పనితీరుపై ప్రతిపక్షాల విమర్శలు మరింత తీవ్రమయ్యాయి. అయితే ఈ కథనంపై ఎన్నికల సంఘం భిన్నంగా స్పందించింది. కమిషన్‌లో అధికారులు, కమిషనర్లు తమ అభిప్రాయాలు, సూచనలు నమోదు చేయడం నిర్ణయ ప్రక్రియలో సహజమని, వాటిని తుది నిర్ణయాలపై విభేదాలుగా చూడరాదని పేర్కొంది. ప్రత్యేక సమగ్ర సవరణ సహా ఎన్నికల సంఘం తీసుకున్న తుది నిర్ణయాలన్నింటికీ ముగ్గురు కమిషనర్ల ఆమోదం ఉందని స్పష్టం చేసింది.

**ప్రతిపక్షాల నుంచి పెరుగుతున్న ఒత్తిడి**

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, మమతా బెనర్జీ సహా పలువురు ప్రతిపక్ష నేతలు జ్ఞానేశ్‌కుమార్ వైదొలగాలని ఇప్పటికే డిమాండ్ చేశారు. మమతా బెనర్జీ ఈ అంశంపై పోరాటాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 30 సమావేశం ద్వారా విడివిడిగా సాగుతున్న ప్రతిపక్షాల నిరసనలను ఉమ్మడి కార్యాచరణగా మార్చే ప్రయత్నం జరుగుతోంది.

# ఓటర్లకు ఇబ్బంది లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ

- ఇంటి వద్దకే బీఎల్ఓలు, డాక్యుమెంట్ల ఆన్‌లైన్ అప్‌లోడ్!
- సమగ్ర సవరణలో కీలక నిర్ణయాలు వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 (ఉద్యమ కెరటం):** ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో నోటీసులు అందుకున్న ఓటర్లకు ఊరట కలిగించేలా కేంద్ర ఎన్నికల సంఘం కీలక మార్పులు ప్రకటించింది. నోటీసుల పరిష్కారం కోసం ఓటర్లు తప్పనిసరిగా అధికారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటివద్దే సహాయం అందించాలని నిర్ణయించింది. బూత్ స్థాయి అధికారులు ఓటర్ల ఇళ్లకు వెళ్లి అవసరమైన పత్రాలు సేకరించి, వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తాజా నివేదికలు వెల్లడించాయి.

**ఇంటికే బూత్ స్థాయి అధికారి**

ఎస్ఐఆర్‌లో భాగంగా నోటీసులు అందుకున్న వారికి పత్రాల సమర్పణ, వివరాల ధ్రువీకరణలో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ చర్యలు చేపట్టింది. అవసరమైన సందర్భాల్లో అధికారులు ఓటర్ల ఇంటికే వెళ్లి పత్రాలు స్వీకరించనున్నారు. దీంతో ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, కార్యాలయాలకు వెళ్లలేని వారికి ప్రక్రియ సులభం కానుంది.

**పత్రాల అప్‌లోడ్ బాధ్యతా అధికారులదే**

ఓటర్లు తమ నోటీసులో కోరిన సంబంధిత పత్రాలను అందిస్తే, వాటిని డిజిటల్ వ్యవస్థలో నమోదు చేయడంలో అధికారులు సహకరించనున్నారు. అవసరమైన చోట సహాయ కేంద్రాల ద్వారా కూడా నోటీసుల పరిష్కారానికి తోడ్పాటు అందించనున్నారు. నోటీసులకు స్పందించేందుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మార్గాలు అందుబాటులో ఉన్నాయి.

**ఎస్ఐఆర్ ప్రక్రియలో మార్పులు**

ఎస్ఐఆర్ అమలులో ఓటర్లకు ఎదురవుతున్న ఇబ్బందులపై ఇటీవల విమర్శలు, ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ సౌలభ్యాలను ప్రకటించింది. నోటీసుల పరిష్కారానికి అదనపు సమయం, ఇంటివద్ద సహాయం, సహాయ కేంద్రాలు వంటి చర్యలను చేపట్టింది. ఎన్నికల సంఘం అధికారిక షెడ్యూల్ ప్రకారం వివిధ రాష్ట్రాల్లో ఇంటింటి పరిశీలన, ముసాయిదా జాబితా, అభ్యంతరాల పరిష్కారం, తుది జాబితా ప్రచురణకు వేర్వేరు గడువులు ఉన్నాయి.

# 'బంగారం కొనొద్దు'.. మోదీ మాట వింటారా?

- అత్యవసరమైతే తప్ప పసిడి కొనుగోళ్లు తగ్గించాలని ప్రధాని పిలుపు
- విదేశీ మారక ద్రవ్యంపై ఒత్తిడి తగ్గించడమే లక్ష్యమని వివరణ
- గణేశ్ చతుర్థి వేళ పరిమాణపరంగా 15 శాతం తగ్గిన అమ్మకాలు
- ధన్‌తేరస్, దీపావళి సీజన్‌లో అసలు పరీక్ష
- ధరల పెరుగుదలా?.. ప్రధాని పిలుపా?.. కొనుగోళ్ల తగ్గుదలకు ఏది ప్రధాన కారణం?



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 (ఉద్యమ కెరటం):** పండగ వచ్చిందంటే పసిడి కొనడం భారతీయులకు ఓ సంప్రదాయం. ధన్‌తేరస్, దీపావళి సమయంలో ఈ సెంటిమెంట్ మరింత బలంగా ఉంటుంది. అయితే ఈసారి పండగల సీజన్‌కు ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన విజ్ఞప్తి ఆసక్తికర చర్చకు తెరతీసింది. అత్యవసరమైతే తప్ప బంగారం కొనుగోళ్లను తగ్గించాలని ఆయన ప్రజలను కోరారు. దిగుమతులపై ఆధారపడే బంగారం కొనుగోళ్లు తగ్గితే విదేశీ మారక ద్రవ్యంపై ఒత్తిడి తగ్గుతుందన్నది ఈ పిలుపు వెనుక ప్రధాన ఆర్థిక కారణం. మోదీ మేలో చేసిన విజ్ఞప్తిని సెప్టెంబర్ 1న మరోసారి పునరుద్ఘాటించారు.

**ఎందుకు బంగారంపైనే దృష్టి?**

భారత్ తన బంగారం అవసరాల్లో గణనీయమైన భాగాన్ని దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో దేశ బంగారం దిగుమతుల విలువ 71.98 బిలియన్ డాలర్లకు చేరిందని గణాంకాలు చెబుతున్నాయి. బంగారం దిగుమతులకు డాలర్లలో చెల్లింపులు చేయాల్సి రావడంతో దిగుమతులు అధికమైతే వాణిజ్య లోటు, కరెంట్ ఖాతా, రూపాయి మారకం విలువపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంటుంది.

**గణేశ్ చతుర్థికి 15 శాతం తగ్గుదల**

మోదీ పిలుపు తర్వాత వచ్చిన తొలి ప్రధాన పండగల సీజన్‌లో బంగారం అమ్మకాల పరిమాణం తగ్గింది. ఈ ఏడాది గణేశ్ చతుర్థి సందర్భంగా గతేడాదితో పోలిస్తే బంగారం విక్రయాలు పరిమాణపరంగా సుమారు 15 శాతం తగ్గినట్లు ఆభరణాల రంగ ప్రతినిధులు వెల్లడించారు. వినియోగదారులు తక్కువ బరువున్న ఆభరణాలవైపు మొగ్గుచూపడంతోపాటు పాత బంగారాన్ని మార్చుకొని కొత్త ఆభరణాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అయితే ఈ తగ్గుదల మొత్తాన్నీ ప్రధాని పిలుపు ప్రభావంగానే చూడటం సరికాదు. గత ఏడాది గణేశ్ చతుర్థి సమయంలో 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.98 వేలుగా ఉండగా, ఈసారి ముంబై స్పాట్ మార్కెట్‌లో పన్నుతో కలిపి రూ.1.57 లక్షల వరకు చేరింది. దాదాపు 60 శాతం ధరల పెరుగుదల కొనుగోళ్ల పరిమాణం తగ్గడానికి ప్రధాన కారణాల్లో ఒకటని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. గణేశ్ చతుర్థి అమ్మకాలు ఒక సంకేతం మాత్రమే. బంగారం మార్కెట్‌కు అసలు పరీక్ష ధన్‌తేరస్, దీపావళి, ఆ తర్వాత వివాహాల సీజన్‌లో ఎదురుకానుంది. అధిక ధరల మధ్య ప్రజలు సంప్రదాయాన్ని కొనసాగిస్తారా? తక్కువ పరిమాణంతో సరిపెట్టుకుంటారా? పాత బంగారం మార్పిడికి మొగ్గుచూపుతారా? లేక పెట్టుబడి మార్గాలను ఎంచుకుంటారా? అన్నది మార్కెట్ ఆసక్తిగా గమనిస్తోంది. ప్రపంచ స్వర్ణ మండలి కూడా అధిక ధరల కారణంగా భారత బంగారం డిమాండ్ ధరల పట్ల సున్నితంగా ఉంటుందని అంచనా వేసింది.

**భౌతిక బంగారమా.. ఈటీఎఫ్‌లా?**

కేవలం పెట్టుబడి కోసమే బంగారం కొనేవారికి భౌతిక ఆభరణాలతోపాటు గోల్డ్ ఈటీఎఫ్‌లు వంటి ప్రత్యామ్నాయాలు కూడా అందుబాటులో ఉన్నాయి. అయితే ఏ మార్గం 'మేలు' అన్నది పెట్టుబడిదారుడి లక్ష్యం, కాలపరిమితి, ఖర్చులు, ప్రమాదాన్ని భరించే సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. అధిక ధరల నేపథ్యంలో కొందరు వినియోగదారులు తేలికపాటి ఆభరణాలు, డిజిటల్ మార్గాలు, ఈటీఎఫ్‌లవైపు చూస్తున్నట్లు మార్కెట్ కథనాలు పేర్కొంటున్నాయి.

## ఈ నెల 27న ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

**జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నదీమ్**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** తెలంగాణ ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం విశేష కృషి చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఈ నెల 27న ఉదయం 10:30 గంటలకు జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నదీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**ఉద్యమ కెరటం, తాండూర్:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను తాండూర్ మండల కేంద్రంలోని ఐబీలో రజక సంఘం సభ్యులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి తాండూర్ మండల రజక సంఘం అధ్యక్షుడు తాండూర్ నరేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెత్తందార్ల దురాగతాలు, నాటి నిరంకుశ రజాకార్లు, దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ మొక్కవోని ధైర్యంతో పోరాడిన తీరు అందరికీ ఆదర్శనీయమన్నారు. ఆమె పోరాట స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం మండల ఉపాధ్యక్షుడు చంద్రగిరి విఘ్నేష్, బెల్లంపల్లి నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు పెండ్యాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చంద్రగిరి సాంబయ్య, తాండూర్ మల్లేష్, లచ్చయ్య, సతీష్, బక్కయ్య, సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజారాం తదితరులు పాల్గొన్నారు.

## బోరిగాంలో రైతు ఐడి రిజిస్ట్రేషన్ కార్యక్రమం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** రైతుల వివరాలను అధికారికంగా నమోదు చేసి, వారికి ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ శాఖ సేవలు సులభంగా అందించేందుకు చేపట్టిన రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమం శనివారం మండలంలోని బోరిగాం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ సాయిప్రణీత్ మాట్లాడుతూ రైతు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవడం ద్వారా రైతుల భూములు, వ్యక్తిగత వివరాలు తదితర సమాచారం అధికారిక రికార్డుల్లో నమోదవుతుందని తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వం అందించే వివిధ పథకాలు, రుణాలు, పంట బీమా, ఎరువులు, సబ్సిడీలు వంటి సేవలను సులభంగా పొందేందుకు ఈ రైతు ఐడి ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. రైతులకు రిజిస్ట్రేషన్ ఆవశ్యకత, రైతు ఐడి ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. రైతులు ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్, పట్టాదారు పాస్‌బుక్ తదితర పత్రాలతో హాజరై తమ వివరాలను నమోదు చేసుకోవలన్నారు. రైతులందరూ ఎలాంటి ఆలస్యం చేయకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాథోడ్ వినీష్, వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మైనారిటీ పట్టణ అధ్యక్షుడిగా సయ్యద్ హాష్మీ



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట కాంగ్రెస్ మైనారిటీ పట్టణ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు సయ్యద్ హాష్మీ నియమితులయ్యారు. జిల్లా కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షుడు షేక్ రియాజ్ శనివారం ఆయన నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా సయ్యద్ హాష్మీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షుడు షేక్ రియాజ్కు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. మైనారిటీ వర్గాల సమస్యలను పార్టీ నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. పట్టణంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మైనారిటీ వర్గాల ప్రజలతో సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. జిల్లా నాయకత్వం మార్గదర్శకత్వంలో గంభీరావుపేట పట్టణంలో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తానన్నారు. సయ్యద్ హాష్మీ నియామకంపై గంభీరావుపేట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# చాకలి ఐలమ్మ పోరాటాలు ఆదర్శనీయం

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** తెలంగాణ నేలపై పుట్టిన ధీర వనిత, అన్యాయాలను ఎదిరించిన వీరనారి, బహుజనుల హక్కుల కోసం పోరాటం చేసిన ఆకలి ఐలమ్మ నేటి సమాజానికి ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ లతో కలిసి హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ఒక సామాన్య కుటుంబంలో పుట్టి, తనకు ఎదురైన అవమానాలకు, నష్టాలకు ఎదురొడ్డి బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఆనాటి భూస్వాములు, రజాకార్లపై వీరోచిత పోరాటం చేశారని తెలిపారు. నేటి తరానికి చాకలి ఐలమ్మ ఒక ఆదర్శనీయమని, ఐలమ్మ స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కొరకు సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. చాకలి ఐలమ్మ కేవలం ఒక కులానికి కాదని, అన్ని వర్గాల హక్కుల కొరకు పోరాటం చేశారని తెలిపారు. మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని, నేటి సమాజంలో ఒక విద్యతోనే అన్నీ సాధించుకోవచ్చని, బడుగు- బలహీన వర్గాల వారు తమ పిల్లలను చదివించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ హాలు, చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటు కొరకు ప్రభుత్వానికి నివేదికలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నదీమ్, రజక సంఘం ప్రతినిధులు కడ్తల మల్లయ్య, రాజేశ్వర్, చంద్రగిరి విలాస్, కడత సాయి, వెనుకబడిన తరగతుల సంఘాల ప్రతినిధులు రూప్ నార్ రమేష్, మారుతి, శంకర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- **సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి దయానంద్**

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అందిస్తున్న నూతన స్మార్ట్ రేషన్ కార్డులను శనివారం మండలంలోని రేజర్ల, రామగోవిందాపురం గ్రామాల్లో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో ప్రజలు, లబ్ధిదారులకుప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ముఖ్యంగా మహిళలకు అందుతున్న సంక్షేమ పథకాలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొందని పేర్కొన్నారు. నూతన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వ రేషన్ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజల తరపున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, మండల తహశీల్దార్, ఎంపీడీఓ, రేజర్ల గ్రామ సర్పంచ్ భీమిరెడ్డి అరుణ, సత్తుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, రామగోవిందాపురం సర్పంచ్ మౌనిక నరేంద్ర రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు,



కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, విద్యార్థి కాంగ్రెస్ నాయకులు, మహిళలు, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- **గుడిహత్నూర్‌లో కాంగ్రెస్ పీఏసీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం**

**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, ఆర్జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆడే గజేందర్ అన్నారు. గుడిహత్నూర్ మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ మండల పీఏసీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్, మాజీ ఎంపీ సోయం బాపురావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు



నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆడే గజేందర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పీఏసీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉండాలని దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలను కలుపుకొని ప్రజా సమస్యలపై పోరాడడంలో నూతన కమిటీ సభ్యుల పాత్ర కీలకమని తెలిపారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాటం చిరస్మరణీయం

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** చాకలి ఐలమ్మ పోరాటం చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్థానిక రిమ్స్ ఆసుపత్రి వద్ద వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముఖ్య అతిథులుగా హాజరై చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక సమానత్వం, ఆత్మగౌరవం కోసం వీరనారి చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె ప్రదర్శించిన ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆమె జీవిత చరిత్రను, సమాజం కోసం అందించిన సేవలను ప్రతిఒక్కరూ గుర్తు చేసుకోవాలని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మ ధైర్యం, పట్టుదల, ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటం చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని అన్నారు. ఆమె స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఆర్ఎస్.చిత్రు,



మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక కార్యక్రమాలు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** వయోవృద్ధుల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వయోవృద్ధుల సంక్షేమం, సాధికారత వారోత్సవాలకు సంబంధించిన గోడ ప్రతులను శనివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధుల ఆరోగ్యం, భద్రత, డిజిటల్ అవగాహన, సామాజిక అనుసంధానం, చట్టపరమైన హక్కులు, సంక్షేమంపై వారోత్సవాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 28న సైబర్ భద్రత, డిజిటల్ అక్షరాస్యత, వయోవృద్ధులపై వేధింపుల నుంచి రక్షణపై అవగాహన కార్యక్రమాలు, 29న తరతరాల మధ్య అనుబంధం, పరస్పర అభ్యాసం, 30న చురుకైన వృద్ధాప్యం, ఆరోగ్య పరిరక్షణ, వాకథాన్ నిర్వహించనున్నట్లు చెప్పారు. అక్టోబర్ 1న రాష్ట్ర, జిల్లా స్థాయిలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామన్నారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం–2007, నిబంధనలు–2011 ప్రకారం వయోవృద్ధులకు ఉన్న హక్కులు, రక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వయోవృద్ధులపై నిర్లక్ష్యం, వేధింపులు, ఇతర సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. సంక్షేమం, రక్షణ కోసం 14567 హెల్ప్‌లైన్, పోలీస్ సహాయం కోసం 100కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. వృద్ధాప్య గృహాల కోసం సామర్థ్య నిర్మాణ కార్యక్రమాల్లో భాగంగా శనివారం వయోవృద్ధుల డే కేర్ సెంటర్లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు బీపీ, షుగర్, కంటి పరీక్షలు, ఎముకల సాంద్రత పరీక్షలు చేపట్టారు. కీళ్ల నొప్పులు, మానసిక ఒత్తిడి, జ్ఞాపకశక్తి సంబంధిత సమస్యలపై వైద్యులు కౌన్సెలింగ్ అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వయోవృద్ధులు పాల్గొన్నారు.

# పేరుకే ఉర్దూ పాఠశాలలు!

- బోధించే ఉపాధ్యాయులు లేరు..
- డిప్యూటేషన్లతో కాలయాపన
- నష్టపోతున్న విద్యార్థులు

**ఉద్యమ కెరటం, జైనూర్:** ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడిన ఉర్దూ పాఠశాలలు నేడు నిశ్శబ్దానికి నిలయాలుగా మారాయి. పాఠశాల భవనాలు ఉన్నా.. చదువుకునేందుకు విద్యార్థులు ఉన్నా.. మైనార్టీలు తమ పిల్లలను స్థానికంగా ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల్లో చదివించాలనే తల్లిదండ్రుల ఆశయం నీరుగారుతోంది. ఉర్దూ బోధించే ఉపాధ్యాయులు లేక చదువుకు దూరమవుతున్నారు. స్థానికంగా నాణ్యమైన విద్య అందక, దూర ప్రాంతాలకు పిల్లలను ఆటోల్లో పంపుతూ ఆర్థిక భారాన్ని భరిస్తున్నారు.

### ఉపాధ్యాయులు ఎక్కడ..?

జైనూర్ మండలంలో మొత్తం మూడు ఉర్దూ మీడియం పాఠశాలలు ఉన్నాయి. వీటిలో రెండు ప్రాథమిక, ఒకటి జిల్లా పరిషత్ హైస్కూల్ ఉంది. అయితే హైస్కూల్లోనూ ఉపాధ్యాయుల కొరత


జనసేన యూత్ అధ్యక్షులు సయ్యద్ ఇర్ఫాన్

ఉండగా, మిగతా ప్రైమరీ ఉర్దూ పాఠశాలలైన మండలంలోని జంగం, గౌరి యూపీఎస్ ఉర్దూ మీడియం పాఠశాలల్లో రెగ్యులర్ ఉర్దూ ఉపాధ్యాయులు లేక పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

### డెప్యూటేషన్లతో నెట్టుకొస్తున్న వైనం..

విద్యా శాఖ అధికారులు ఉపాధ్యాయులు లేనిచోట ఇతర పాఠశాలల నుంచి టీచర్లను డెప్యూటేషన్పై పంపి తాత్కాలికంగా పాఠశాలలను నడిపిస్తున్నారు. జైనూర్ లో 350 మంది, గౌరి


జంగం ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ

30 మంది, జంగం 50 మంది వరకు విద్యార్థులు పాఠశాలలకు వస్తున్నప్పటికీ, శాశ్వత ఉపాధ్యాయులు లేకపోవడంతో వారికి పూర్తిస్థాయిలో బోధన అందడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉపాధ్యాయులు ఉన్న సమయంలో ఉర్దూ పాఠశాలలు పిల్లలతో కళకళలాడేవని, ఇప్పుడు ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యా ప్రమాణాలు దెబ్బ తింటున్నాయని, పిల్లల భవిష్యత్ ఎటుపోతుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారులు పట్టించుకోవాలి..

స్థానిక ఉర్దూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆ భవనాలు నిరుపయోగంగా మారాయి. విద్యా శాఖ అధికారులు స్పందించి వెంటనే ఉర్దూ పోస్టులను భర్తీ చేసి నిరుపేద విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలని కోరుతున్నారు.

### నిరుపయోగంగా భవనాలు

**సయ్యద్ సజ్జద్ అలీ, ఉప సర్పంచ్, జంగం**

ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల్లో గత కొన్నేళ్లుగా ఉర్దూ ఉపాధ్యాయుల నియామకం జరగలేదు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోవడంతో పాఠశాలలు నిరుపయోగంగా మారుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

### ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి..

**సయ్యద్ ఇర్ఫాన్, జనసేన యూత్ అధ్యక్షులు**

ప్రభుత్వం స్పందించి ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి. పాఠశాలల్లో అవసరమైన మౌళిక వసతులు కల్పించాలి. ఉర్దూ విద్యను పరిరక్షించి, విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.






# చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

### జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం వీరనారి చాకలి ఐలమ్మ చేసిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శనివారం చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి, కుల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మగౌరవం కోసం నాటి దొరల రాచరిక పాలనను వ్యతిరేకిస్తూ ఆమె సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి, ధైర్యసాహసాలను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆమె జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం ద్వారా వారి త్యాగాలు, ఆశయాలు, పోరాట స్ఫూర్తి భవిష్యత్ తరాలకు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత



శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు

- ఈనెల 28, 29, 30 తేదీల్లో దేశవ్యాప్త సమ్మె

**ఉద్యమ కెరటం, తాండూర్:** బ్యాంకు ఉద్యోగులు, అధికారులు ఈనెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న మూడు రోజుల దేశవ్యాప్త సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలుపుతుందని సీపీఎం మంచిర్యాల జిల్లా సభ్యుడు దాగం రాజారాం తెలిపారు. శనివారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబీలో ◌ాయన మాట్లాడుతూ సమ్మెకు పార్టీ జిల్లా కమిటీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలని, పీఎల్ఐ (ప్రొడక్టివిటీ లింక్డ్ ఇన్సెంటివ్) పథకం అమలులో ఏకపక్ష విధానాన్ని వ్యతిరేకిస్తూ 12వ వేతన ఒప్పందంలోని



పెండింగ్ డిమాండ్లను పరిష్కరించాలని యూఎఫ్బీయూ ఆధ్వర్యంలో సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం బ్యాంకింగ్ రంగాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నాలను నిలిపివేయాలని, ఉద్యోగులు, అధికారుల సంఘాలతో కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐదు రోజుల పని విధానంపై 2023లో ఐబీఏ–యూఎఫ్బీయూ మధ్య అవగాహన కుదిరి, కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపినప్పటికీ ఇప్పటివరకు నిర్ణయం తీసుకోకపోవడం అన్యాయమన్నారు. బ్యాంకు ఉద్యోగులు, అధికారుల డిమాండ్ల సాధనతో పాటు ప్రభుత్వ బ్యాంకింగ్ రంగ పరిరక్షణకు చేపడుతున్న సమ్మెకు కార్మికవర్గం మొత్తం మద్దతు ఇవ్వాలని కోరారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వేల్పుల శంకర్, బొల్లం రాజేశం పాల్గొన్నారు.

# వీర నారి చాకలి ఐలమ్మకు ఘన నివాళులు

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తెలంగాణ ప్రభుత్వం, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రిమ్స్ ఆస్పత్రి ముందర, ఆర్ఎస్ ఫంక్షన్ హాల్లో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్, అడిషనల్ కలెక్టర్ చిత్రులతో కలిసి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరయ్యారు. చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అటు రిమ్స్ ఎదురుగ ఉన్న ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి సోనియా, రజక సంఘం నాయకులు దత్తు, రజక సంఘం అధ్యక్షులు కార్తీక్, మహిళా అధ్యక్షురాలు రమక్క, వేముల నాగరాజ్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రతి డ్రైవర్ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



**ఉద్యమ కెరటం, సిర్పూర్ (యు):** ప్రతి వాహన డ్రైవర్ తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఏఎస్సై గంగారాం సూచించారు. సురక్షా తిరంగా కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో డ్రైవర్లకు రోడ్డు భద్రత, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై వాహనాల్లో ప్రయాణించే ప్రతిఒక్కరూ సురక్షితంగా ఇంటికి చేరుకోవాలంటే డ్రైవర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వాహనానికి సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అవసరమైన అన్ని ధ్రువపత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. అలాగే సోషల్ మీడియాలో జరుగుతున్న వివిధ రకాల సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. తెలియని నంబర్ల నుంచి ఫోన్ కాల్స్ వస్తే స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.

# మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** భవిత మండల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం సీఆర్పీలు, గ్రామ సంఘాల ప్రతినిధులకు ఆర్థిక అక్షరాస్యతపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా శిక్షణలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళలకు పొదుపు ప్రాధాన్యత, బ్యాంకు లావాదేవీలు, రుణాల వినియోగం తదితర అంశాలపై వివరించారు. క్లస్టర్ లెవల్ ఫెడరేషన్, సంఘాల నిర్వహణ, సుస్థిరత, రికార్డుల పారదర్శక నిర్వహణ, గ్రామ సంఘాల బలోపేతంపై శిక్షణ ఇచ్చారు. మహిళలు చేపట్టే చిరు వ్యాపారాల నిర్వహణ, మార్కెటింగ్ మెళుకువలు, లాభనష్టాల అంచనాపై ఏపీఎం వెంకట్రెడ్డి అవగాహన కల్పించారు. ప్రతి గ్రామ సంఘం ఆర్థికంగా బలోపేతం కావాలంటే సభ్యుల్లో ఆర్థిక క్రమశిక్షణ, వ్యాపార అవగాహన అవసరమని మండల సమాఖ్య అధ్యక్షురాలు లలిత తెలిపారు. వీటితోనే సంఘాలు సుస్థిరంగా కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు కృష్ణవేణి, కుసుమకుమారి, పద్మ, నాగలక్ష్మి, సీసీలు, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


# బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్లో భారీగా చేరికలు



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోకి శనివారం పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరారు. ఊర్వత రోహిత్, పెందూర్ జీవన్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్, ఆర్జీపీ ఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆడే గజేందర్, డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, మాజీ ఎంపీ సోయం బాపురావు వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు. బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్ ఖాన్, గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తొడసం దౌలత్రావు, గుడిహత్నూర్ మండల కేంద్రం సర్పంచ్ ఆడే శీల, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వాగ్మారె విశ్వాంబర్తో పాటు మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# రెండు బైకులు ఢీ

### ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూరు మండల పరిధిలోని లింగపాలెం వద్ద శనివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను వైద్య సేవల కోసం అంబులెన్స్లో సత్తుపల్లి ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

# రోడ్డున పడ్డ కలం గుండె..

**పాత్రికేయుడిగా.. ఆర్ఎంపీ వైద్యుడిగా సేవలు**

**నారాయణ మృతి.. దిక్కుతోచని స్థితిలో కుటుంబం**







**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** పేదరికంలో పుట్టి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ పాత్రికేయుడిగా, ఆర్ఎంపీ వైద్యుడిగా ప్రజలకు సేవలందించిన కొల్లమద్ది గ్రామానికి చెందిన ఎడబోయిన నారాయణ(43) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. కొన్నేళ్లుగా పాత్రికేయ వృత్తితో పాటు ఆర్ఎంపీ వైద్యుడిగా గ్రామ ప్రజలకు తనవంతు సేవలు అందిస్తూ మంచి గుర్తింపు పొందారు. నారాయణ మృతితో కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. మృతుడికి భార్య ఎడబోయిన సరితతో పాటు పిల్లలు ప్రణవి, శ్రీనిత్య, సుహాన్స్ ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న నారాయణ మృతిచెందడంతో చిన్నారుల భవిష్యత్తుపై ఆందోళన నెలకొంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఈ కుటుంబాన్ని దాతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సేవా సంస్థలు పెద్ద మనసుతో ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కుటుంబానికి అండగా నిలిచి పిల్లల చదువుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# కొత్తపల్లి డబుల్ రోడ్డుకు తక్షణ నిధులు మంజూరు చేయాలి



**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి డబుల్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులను తక్షణమే మంజూరు చేసి పనులు ప్రారంభించాలని బీజేవైఎం రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దూరి పరశురాములు గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి సిరిసిల్ల పర్యటనకు వస్తున్న నేపథ్యంలో కొత్తపల్లి రహదారి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కొత్తపల్లి గ్రామానికి ఉన్న ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో గ్రామ ప్రజలు, విద్యార్థులు, రైతులు, వాహనదారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలంలో రహదారి పరిస్థితి మరింత దారుణంగా మారుతోందన్నారు. గ్రామం నుంచి మండల కేంద్రంతో పాటు సమీప పట్టణాలకు రాకపోకలు సాగించే ప్రజలకు ఈ రహదారి ఎంతో కీలకమని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రులకు తరలించేందుకు, విద్యార్థులు విద్యాసంస్థలకు వెళ్లేందుకు, రైతులు వ్యవసాయ అవసరాల కోసం రాకపోకలు సాగించేందుకు రహదారి సౌకర్యం సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా డబుల్ రోడ్డు కోసం గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్నప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదన్నారు. సీఎం రేవంత్రెడ్డి సిరిసిల్ల పర్యటన సందర్భంగా కొత్తపల్లి డబుల్ రోడ్డు సమస్యను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

# బలహీన వర్గాల కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ



**ఉద్యమ కెరటం, కరీంనగర్:** బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధన కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ రోడ్డులోని చాకలి ఐలమ్మ విగ్రహానికి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువ, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఆమె ఆశయాలను, పోరాట స్ఫూర్తిని సమాజంలో ప్రతిఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు.

# భూ సంబంధిత దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** భూభారతి, రెవెన్యూ సదస్సులు, సాదాబైనమాల భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, శిక్షణ ఉపపాలన అధికారి జాస్టిన్ జోల్ లతో కలిసి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, భూభారతి దరఖాస్తులు, సాదా బైనమాల పరిష్కారం, రీ సర్వే అంశాలపై తహసిల్దార్లు మండల సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులలో పెండింగ్ లో ఉన్న వాటిని, భూ భారతీ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాదా బైనమా క్రింద భూముల క్రమబద్ధీకరణ కొరకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారించి నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించాలని తెలిపారు. కొన్ని మండలాలలో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయని, ఇందుకు గల కారణాలను సంబంధిత తహసిల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే, నాన్ క్యాడస్టల్, గ్రామాలలో రీ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, ఆయా గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి గ్రామాల సరిహద్దులను గుర్తించి ఎంజాయ్మెంట్ సర్వే నిర్వహించాలని తెలిపారు. రీ సర్వేలో తీసుకోవలసిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. వినయ్, తహసిల్దార్లు, మండల సర్వేయర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మైనారిటీ విభాగానికి నూతన సారథులు

- **మండల అధ్యక్షుడిగా యాసీన్ హుస్సేన్.. జిల్లా ప్రధాన కార్యదర్శిగా నయ్యర్**





**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగంలో నూతన నియామకాలు జరిగాయి. మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ యాసీన్ హుస్సేన్, సయ్యద్ నయ్యర్లకు కీలక బాధ్యతలు అప్పగించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు షేక్ రియాజ్ శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. గంభీరావుపేట మండల కాంగ్రెస్ మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా మహమ్మద్ యాసీన్ హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ నయ్యర్ను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన నాయకులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతంతో పాటు మైనారిటీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన నాయకులకు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

# భవన నిర్మాణాలు వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**





**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలో నిలిచిపోయిన గ్రామ పంచాయతీ, వీఓ, అంగన్వాడీ భవనాల నిర్మాణాలను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లో అధికారులు, సర్పంచులు, కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మధ్యలో నిలిచిన జీపీ భవనాల పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణాలు ప్రారంభం కాని భవనాల మంజూరులను రద్దు చేసి ఉపాధిహామీ, బీవీజీ రామ్ జీ, ఇతర ప్రత్యామ్నాయ నిధులతో కొత్తగా మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఎస్డీఎఫ్ నిధులతో చేపట్టి నిలిచిపోయిన పనులను పరిశీలించి అవసరమైన చోట ప్రత్యామ్నాయ నిధులతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభమై నిలిచిపోయిన జీపీ భవనాలను మరమ్మతుల కింద పూర్తి చేయాలని సూచించారు. వీఓ భవనాలను అక్టోబర్లోగా, మిగిలిన పెండింగ్ పనులన్నింటినీ నవంబర్ 15లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అందిన దరఖాస్తులకు సంబంధించి వేజ్ జనరేషన్ ప్రక్రియను వేగవంతం చేసి గ్రామాల్లో అందుబాటులో ఉన్న ఉపాధికి అనుగుణంగా పనులు కల్పించాలని సూచించారు. సర్పంచులు, కాంట్రాక్టర్లు, అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. సమన్వయ లోపంతో పనులు ఆలస్యం కావడంతో పాటు బిల్లుల చెల్లింపుల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. అక్టోబర్ 2న గ్రామసభల్లో అవసరమైన తీర్మానాలు పూర్తిచేసిన అనంతరం అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపును వేగవంతం చేస్తామని తెలిపారు. పనుల పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ పీడీ రాథోడ్ రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, పంచాయతీరాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈలు శివరాం, తనాజీ, ఇంజినీరింగ్ అధికారులు, సర్పంచులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.


# సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- **అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: మంత్రి తుమ్మల**



**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** ఈనెల 30న ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి రానున్న నేపథ్యంలో అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు సిరిసిల్ల రగుడు బైపాస్ రోడ్ సమీపంలోని మైదానంలో బహిరంగ సభలో పాల్గొననున్నట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీసు అధికారులు ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, భద్రతా చర్యలను సమగ్ర ప్రణాళికతో చేపట్టాలని సూచించారు. జిల్లా అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలని అన్నారు. ప్రజలు చిరకాలం గుర్తుంచుకునేలా సేవలు అందించాలని, జిల్లా సమగ్ర అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను నిర్ణీత ప్రణాళిక ప్రకారం పూర్తి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంత్రులకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్బాబు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేని, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి.గితె, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.







# చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలి

- **అన్యాయానికి వ్యతిరేకంగా ఆమె పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకం**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** తెలంగాణ రైతాంగ పోరాట వీరనారి, ధీరవనిత చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను సత్తుపల్లి పట్టణంలోని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం సత్తుపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు ఉప్పు హనుమంతరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రెహాన బేగం, సీపీఎం నాయకుడు మోరంపూడి పాండు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ కేవలం ఒక వర్గానికి చెందిన నాయకురాలు కాదని, అన్యాయానికి, దోపిడీకి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన వీరనారి అని పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం చాకలి ఐలమ్మ చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బీసీలు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. చాకలి ఐలమ్మ ధైర్య సాహసాలు మహిళలకు, యువతకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు. ఆమె పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు దుస్స వెంకటేశ్వర్లు, మరీదు ప్రసాద్, కోమటి తిరుమలరావు, తమిశెటి గణేష్, దేవళ్ల శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు కమల్ పాషా, షరీఫ్, కంటే అప్పారావు, సీపీఎం నాయకులు సర్వేశ్వరరావు, రిటైర్డ్ ఉద్యోగ సంఘాల నాయకులు గుండాల కృష్ణయ్య, మాల మహానాడు నాయకులు పిల్లి మల్లికార్జున్, సామెల్, ఎమ్మార్పీఎస్ నాయకుడు అర్జున్‌రావు, జనసేన నాయకులు అప్పారావు, చైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ మురళి, రజక సంఘం నాయకులు తెలగారపు అప్పారావు, సాయి శ్రీను, కోట సత్యనారాయణ, టోపీ శ్రీను, చెన్నారావు, బీసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి సైన్స్ సెమినార్లో అల్ఫోర్స్ విద్యార్థినికి ప్రథమ స్థానం

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక




**ఉద్యమ కెరటం, కరీంనగర్:** విద్యార్థులు వివిధ రకాల పోటీ పరీక్షలు, పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్కు చెందిన 10వ తరగతి విద్యార్థిని సి.నిత్యమహి జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్షలు, వివిధ రకాల పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో ప్రతిభ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అన్ని అంశాలపై పరిజ్ఞానం అందించడంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో వివిధ స్థాయిల్లో శిక్షణ ఇప్పిస్తున్నామని చెప్పారు. శిక్షణ అనంతరం ప్రతిభ కనబర్చే విద్యార్థులను వివిధ పోటీలకు ఎంపిక చేసి, విజయాలు సాధించేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఇటీవల కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సైన్స్ మ్యూజియంలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్లో నిత్యమహి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని సాధించిందన్నారు. త్వరలో హైదరాబాద్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థిని నిత్యమహితో పాటు గైడ్ టీచర్ దీప్తిని కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

## హాజరైన పలువురు మంత్రులు



**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈనెల 30న జరిగే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని మంత్రులు తుమ్మల, శ్రీధర్ బాబు కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. బహిరంగ సభను విజయవంతం చేయడమే లక్ష్యంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, మాజీ ఎమ్మెల్యే కటుకం మృత్యుంజయం తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ను ప్రశంసించారు. శాసనసభలో ముఖ్యమంత్రి తర్వాత ఆది శ్రీనివాస్ చెప్పిన మాటకు ప్రాధాన్యత ఉంటుందని, ఆయన మంచి మనసు, మంచి స్వభావం కలిగిన వ్యక్తి అని పేర్కొన్నారు. సిరిసిల్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని, సీఎం ఈ నియోజకవర్గాన్ని ఎంచుకోవడం వెనుక ఉన్న ఉద్దేశాన్ని అర్థం చేసుకోవాలన్నారు. రేవంత్ రెడ్డి గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని శపథం చేసి అధికారంలోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. గతంలో కాంగ్రెస్ కార్యకర్తలపై నమోదైన కక్షపూరిత కేసుల అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి ఆది శ్రీనివాస్ కోరిక మేరకు జరుగుతోందని తెలిపారు. రైతులు, నేతన్నల సంక్షేమమే ప్రభుత్వానికి ముఖ్యమని, బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్లో ఉంచిన బకాయిలను తమ ప్రభుత్వం చెల్లిస్తోందని చెప్పారు. నేతన్నల కోసం వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని, యారన్ డిపోను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ రంగంలో రోల్ మోడల్గా నిలుస్తోందని తుమ్మల అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, కేంద్రం నుంచి ఎదురవుతున్న సమస్యల మధ్య కూడా సీఎం రేవంత్ రెడ్డి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

## కరీంనగర్ సీపీ గౌష్ ఆలం




**ఉద్యమ కెరటం, కరీంనగర్:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ లో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం భూస్వామ్య శక్తులకు ఎదురొడ్డి నిలిచిన ధైర్యశాలి చాకలి ఐలమ్మ అని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఆమె చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. మహిళా చైతన్యం, ఆత్మగౌరవానికి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని తెలిపారు. ఆమె ఆశయాలను, పోరాట స్ఫూర్తిని ప్రతిఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఆర్ఐ కిరణ్కుమార్, కమిషనరేట్ పరిపాలనా విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొని చాకలి ఐలమ్మకు నివాళులర్పించారు.

# పర్యాటక అభివృద్ధికి జిల్లాలో అపార అవకాశాలు





## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రకృతి వనరులు, పర్యావరణ సమతుల్యతతో పాటు చారిత్రక, ఆధ్యాత్మిక, సాహస పర్యాటకానికి జిల్లాలో అపార అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, డీఆర్వో మోతీరామ్, పర్యాటక నోడల్ అధికారి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, ఆర్డీఓ శ్రీనివాసరావుతో కలిసి జిల్లా టూరిజం లోగో, టూరిజం మ్యాగజైన్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు ఉన్న సామర్థ్యంతో పోలిస్తే సందర్శకుల సంఖ్య తక్కువగా ఉందన్నారు. పర్యాటక ప్రాంతాలను విస్తృతంగా ప్రచారం చేసి పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సాహస పర్యాటకానికి అనువైన ప్రాంతాల్లో రాక్ క్లైంబింగ్ వంటి కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. శివ్వారం వన్యప్రాణి సంరక్షణ కేంద్రం అభివృద్ధి అవకాశాలను పరిశీలించాలని సూచించారు. తాడోబా వైపు వెళ్లే మార్గంలో జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పర్యాటకం ద్వారా వచ్చే ఆదాయాన్ని తిరిగి పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు పాఠశాల విద్యార్థులను వివిధ పర్యాటక ప్రాంతాలకు విహారయాత్రలకు తీసుకెళ్లేలా చర్యలు చేపడతామన్నారు. క్విజ్లు, పోటీలు నిర్వహించడం ద్వారా పర్యాటక ప్రాధాన్యంపై అవగాహన పెంచవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పాఠశాల, ఇంటర్మీడియట్ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, పెయింటింగ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

**ఉద్యమ కెరటం,ఉప్పల్ ప్రతినిధి:**

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి పనులను త్వరితగతిన చేపట్టాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం పలువురు కాలనీవాసులతో కలిసి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల్ సర్కిల్‌లో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనుల వివరాలను కమిషనర్‌కు వివరించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ఆమోదించిన పనుల వివరాలను కూడా అందజేసి, వాటికి అవసరమైన నిధులను మంజూరు చేసి పనులు ప్రారంభించాలని పరమేశ్వర్‌రెడ్డి కోరారు.

**చేపట్టాల్సిన ప్రధాన అభివృద్ధి పనులు**

శ్రీ సాయి కాలనీ, శేష సాయి నగర్, అమృత కాలనీ, మల్లికార్జున నగర్, ఉప్పల్ హిల్స్, ఓల్డ్ విలేజ్, లక్ష్మారెడ్డి కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఉప్పల్ శ్రీశ్రీనగర్‌లోని ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ హాల్‌లో లిఫ్ట్, ఫ్లోరింగ్, ఎలివేషన్ తదితర మిగిలిన పనులతో పాటు సీనియర్ సిటిజన్ భవనం, గాంధీనగర్‌లోని నవోదయ యువజన సంఘం భవనంలో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు.

# భక్తిశ్రద్ధలతో పార్శ్వనాథ భగవాన్ ఊరేగింపు





- **వైభవంగా పల్లకి సేవ.. ప్రత్యేక పూజల్లో కలెక్టర్ ప్రతీక్ జైన్**

**ఉద్యమ కెరటం, హత్నూర:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం నవాబుపేట గ్రామంలోని పురాతన జైన మందిరంలో భాద్రపద పౌర్ణమి సందర్భంగా శనివారం భక్తి వైభవం వెల్లివిరిసింది. జైన సోదరులు, భక్తులు పార్శ్వనాథ భగవాన్కు ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ నవాబుపేట జైన మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం పార్శ్వనాథ భగవాన్ విగ్రహాన్ని పల్లకిలో ప్రతిష్ఠించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. పల్లకి సేవలో జైన సోదరులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల ఆధ్యాత్మిక నినాదాలు, పూజా కార్యక్రమాలతో నవాబుపేటలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో హత్నూర తహశీల్దార్ ఫర్హీన్ షేక్, సర్పంచ్ బుచ్చయ్య, ఉప సర్పంచ్ బాబి, పాత్రికేయుడు అన్వర్ హుస్సేన్, జైన సోదరులు శివన్న, సత్యనారాయణ, సిద్దార్థ్, కృష్ణమూర్తి, శ్రీనాథ్, నర్సింలు, వీరన్న, నేమినాథ్, మోహన్, వర్ధమాన్, శశికాంత్, శేఖర్, విశాల్, రోహన్, రాహుల్, సుశీల్, రాగోల్ ఆదిరాజ్, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# గిరిజన అభివృద్ధికి బడ్జెట్ పెంచాలి

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** హైదరాబాదులో శనివారం జరిగిన గిరిజన సంక్షేమ కమిటీ తొలి సమావేశంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి పాల్గొని, గిరిజన ప్రాంతాల్లో విద్య, మౌలిక వసతులు, ఉద్యోగ భద్రత మరియు బడ్జెట్ కేటాయింపులపై పలు కీలక ప్రతిపాదనలు చేశారు. ఇటీవల తాను సందర్శించిన ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు, రాబోయే చలికాలంలో విద్యార్థుల కోసం గీజర్లు ఏర్పాటు చేసి వేడినీటి సదుపాయం అందించాలని కోరారు. జిల్లాలో పనిచేస్తున్న కాంట్రాక్ట్



రెసిడెన్షియల్ టీచర్లకు ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతన స్కేలు అమలు చేయాలని, మరణించిన సీఆర్టీల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇంజినీరింగ్ శాఖ పరిధిలో నిలిచిపోయిన రోడ్లు, కల్వర్టుల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచిస్తూ, ఎస్టీ నియోజకవర్గాల్లో జనాభా ప్రాతిపదికన నిధుల కేటాయింపు జరగాలని, గిరిజన జనాభా తక్కువగా ఉన్న ప్రాంతాలకు అధిక నిధులు ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే గాదిగూడ, నార్నూర్ మండలాల్లో గిరివికాసం కింద మంజూరైన బోర్‌వెల్లకు మోటార్లు బిగించాలని, లింగాపూర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్లకు అటవీ అనుమతులు త్వరగా ఇచ్చి నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. రాబోయే పోలీస్ నియామకాలలో ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు 75 శాతం ఉద్యోగాలలో రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# జర్నలిస్టులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**టీయూడబ్ల్యుజే (ఐజేయు) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రహమాన్, ఎస్ సంపత్ కుమార్**



**ఉద్యమ కెరటం, కౌటాల :** జర్నలిస్టులకు ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టీయూడబ్ల్యూజే-ఐజేయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో టీయూడబ్ల్యూజే జిల్లా 3వ మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని గుర్తు చేశారు. ప్రభుత్వాలు మారిన జర్నలిస్టుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల న్యాయమైన ఇండ్ల స్థలాల, ఇండ్లు దీర్ఘకాలిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాలు నిర్వహించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం జర్నలిస్టులు ఐక్యంగా ఉండి పోరాడేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 7 తేదీ బుధవారం జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్‌లోని ఏ రోజు గార్డెన్ ఫంక్షన్ హాల్లో జిల్లా మహాసభ నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. జర్నలిస్టులు హక్కుల సాధన , హక్కుల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న జర్నలిస్టుల జిల్లా మహాసభలకు జిల్లాలోని జర్నలిస్టులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, టి యు డబ్ల్యూ జే జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్ గౌడ్, జిల్లా నాయకులు రాధాకృష్ణ చారి, అమూల్ గౌడ్, జర్నలిస్టులు కే నరేష్, ఎంఎల్ మారయ్య, చకినాల సురేష్, కే రవీందర్, బొద్దున శ్రీనివాస్, నాగభూషణం, వినోద్, రాధా శ్యామ్, ప్రేమ్ సాగర్, తిరుపతి, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లుకు ఘన సన్మానం

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ పట్టణంలోని జెడ్పీఎస్ఎస్ జనకాపూర్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ధర్మపురి వెంకటేశ్వర్లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న సందర్భంగా శనివారం ఆయనకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వరరావు తన నివాసంలో వెంకటేశ్వర్లును శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అరిగెల నాగేశ్వరరావు మాట్లాడుతూ వెంకటేశ్వర్లు తన విధులను ఎంతో నిష్ఠతో, బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ అనేక మంది విద్యార్థులను ఉన్నత స్థానాలకు తీసుకెళ్లారని కొనియాడారు. గతంలో ఆయన రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కూడా అందుకున్నారని గుర్తుచేశారు. బోధనతో పాటు సాంస్కృతిక, కవిత్వ, ఆధ్యాత్మిక రంగాల్లోనూ, అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా పాల్గొంటున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో చైతన్య కళాశాల డైరెక్టర్ సాయిని రాజశేఖర్, బీజేపీ నాయకులు సుంకరి పెంటయ్య, గాజుల రాజేంద్రప్రసాద్, ప్రసాద్ గౌడ్, గాజుల సత్యనారాయణ, దీపక్ రావు తదితరులు పాల్గొన్నారు.



# టీయూడబ్ల్యూజే జిల్లా మహాసభకు జయప్రదం చేయండి

**హలో జర్నలిస్ట్ అక్టోబర్ 7న చలో ఆసిఫాబాద్**

**టీయూడబ్ల్యుజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్**

**ఉద్యమ కెరటం, చింతల మానేపల్లి :** జిల్లా జర్నలిస్టుల హక్కుల సాధన, హక్కుల పరిరక్షణ కోసం అక్టోబర్ 7వ తేదీన నిర్వహిస్తున్న జిల్లా టియుడబ్ల్యూజే మూడో మహాసభకు జిల్లాలోని జర్నలిస్టులు అధిక సంఖ్యలు తరలివచ్చి జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టీయూడబ్ల్యూజే-ఐజేయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ సంపత్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో టీయూడబ్ల్యూజే జిల్లా 3వ మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జర్నలిస్టుల న్యాయమైన ఇండ్ల స్థలాల, ఇండ్లు దీర్ఘకాలిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాలు నిర్వహించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం జర్నలిస్టులు ఐక్యంగా ఉండి పోరాడేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 7 తేదీ బుధవారం జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ లోని ఏ రోజు గార్డెన్ ఫంక్షన్ హాల్లో జిల్లా మహాసభ ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని తెలిపారు. జర్నలిస్టులు హక్కుల సాధన, జిల్లాలోని జర్నలిస్టులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, టియుడబ్ల్యూ జే జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్ గౌడ్, జిల్లా నాయకులు రాధాకృష్ణ చారి, జర్నలిస్టులు చౌదరి హరి, సత్పోతే తిరుపతి, దుబ్బుల మహేష్, కోట సాయి, చౌదరి లక్ష్మణ్, గుర్లె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.






# క్వార్టర్‌ఫైనల్లో అఫ్గాన్‌తో టీమిండియా ఢీ

**నాగోయా, సెప్టెంబరు 26 (ఉద్యమ కెరటం):** ఆసియా క్రీడలు-2026 పురుషుల క్రికెట్‌లో టీమిండియా క్వార్టర్‌ఫైనల్ ప్రత్యర్థి ఖరారైంది. డిఫెండింగ్ ఛాంపియన్స్‌గా బరిలోకి దిగుతున్న భారత్.. సెప్టెంబరు 28న అఫ్గానిస్థాన్‌తో తలపడనుంది. జపాన్-నేపాల్ గ్రూప్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో ఈ సమీకరణం ఖరారైంది. శనివారం జపాన్, నేపాల్ మధ్య జరిగిన గ్రూప్-ఎ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించింది. తొలుత బ్యాటింగ్ చేసిన నేపాల్ 15 ఓవర్లలో 4 వికెట్లకు 149 పరుగులు చేసింది. సుందీప్ జోరా, లోకేశ్ బామ్ అర్ధశతకాలతో రాణించారు. అనంతరం జపాన్ ఛేదన ప్రారంభించాల్సిన సమయంలో భారీ వర్షం కురవడంతో ఒక్క బంతి కూడా పడలేదు. దీంతో మ్యాచ్ రద్దయి జపాన్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. నేపాల్ గ్రూప్-ఎ విజేతగా, అఫ్గానిస్థాన్ రెండో స్థానంలో నిలిచాయి. గ్రూప్ దశ అనంతరం క్వార్టర్‌ఫైనల్ లైనప్ పూర్తిగా ఖరారైంది. సెప్టెంబరు 28న భారత్-అఫ్గానిస్థాన్, పాకిస్థాన్-హాంకాంగ్ జట్లు తలపడనున్నాయి. సెప్టెంబరు 29న నేపాల్-శ్రీలంక, బంగ్లాదేశ్-మలేషియా మధ్య క్వార్టర్‌ఫైనల్స్ జరగనున్నాయి. భారత్-అఫ్గానిస్థాన్ మ్యాచ్ సోమవారం ఉదయం 10.30 గంటలకు భారత కాలమానం ప్రకారం ప్రారంభం కానుంది.

## 2027 ప్రపంచకప్‌దే చివరిది..
# కోహ్లీ కీలక ప్రకటన


**తిరువనంతపురం, సెప్టెంబరు 26 (ఉద్యమ కెరటం):** టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన వన్డే కెరీర్‌పై కీలక వ్యాఖ్యలు చేశాడు. 2027లో దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచకప్ తన కెరీర్‌లో చివరి ప్రపంచకప్ కానుందని తెలిపాడు. ఆ టోర్నీలో భారత్‌కు ప్రపంచకప్ అందించి కెరీర్‌ను ఘనంగా ముగించడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు ముందు జియోస్టార్‌తో మాట్లాడిన కోహ్లీ ఈ వ్యాఖ్యలు చేశాడు. 50 ఓవర్ల ప్రపంచకప్‌లో ఉండే ఉత్కంఠ, తీవ్రత మరే టోర్నీలోనూ ఉండదని కోహ్లీ చెప్పాడు. ఒకే మ్యాచ్‌లో దాదాపు రెండున్నర టీ20 మ్యాచ్‌లు ఆడినంత శ్రమ ఉంటుందని, విదేశీ గడ్డపై సుమారు పది మ్యాచ్‌ల పాటు ఆ తీవ్రతను కొనసాగించడం శారీరకంగా, మానసికంగా పెద్ద సవాల్ అని వివరించాడు. భారత్ తరఫున తాను ఆడబోయే చివరి ప్రపంచకప్ ఇదేనని, అదే తనకు మరింత ప్రేరణనిస్తోందని కోహ్లీ తెలిపాడు. ప్రపంచకప్ గెలవడమే అంతిమ లక్ష్యమని, అందుకోసం పూర్తి స్థాయిలో శ్రమించేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశాడు.వన్డే ప్రపంచకప్‌లలో కోహ్లీకి అద్భుతమైన రికార్డు ఉంది. ఇప్పటివరకు 37 ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో 59.83 సగటుతో 1,795 పరుగులు చేశాడు. ఇందులో ఐదు శతకాలు, 12 అర్ధశతకాలు ఉన్నాయి. మొత్తంగా వన్డేల్లో కోహ్లీ 54 శతకాలతో 14 వేలకుపైగా పరుగులు సాధించాడు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా రాబోయే ప్రపంచకప్‌పై తన దృష్టి ఉందని చెప్పాడు. తాను ఆడుతున్నంత కాలం కొత్త లక్ష్యాలు ఉంటాయని, ప్రస్తుతం తన ముందున్న లక్ష్యం 2027 ప్రపంచకప్ అని పేర్కొన్నాడు. ఐసీసీ టోర్నీల్లో భిన్నమైన ప్రత్యర్థులు, వేదికలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, అందుకు తగిన విధంగా సన్నద్ధం కావాల్సి ఉంటుందని వివరించాడు. భారత్, వెస్టిండీస్ మధ్య మూడు వన్డేల సిరీస్ సెప్టెంబరు 27 నుంచి తిరువనంతపురంలో ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు మొదలవుతుంది. ఈ సిరీస్ 2027 ప్రపంచకప్ సన్నాహకాల్లో భాగంగా సాగనుంది.





# ‘ది వాన్’తోనూ తమన్నాకు నిరాశేనా?

హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఉద్యమ కెరటం): ముంబయి నుంచి వచ్చి టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన తమన్నా భాటియా.. దక్షిణాదిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ‘మిల్కీ బ్యూటీ’గా అభిమానుల మన్ననలు అందుకున్న ఆమె.. స్టార్ హీరోల సరసన వరుస అవకాశాలతో అగ్ర కథానాయికగా కొనసాగారు. అయితే బాలీవుడ్‌లో మాత్రం హీరోయిన్‌గా ఆశించిన స్థాయిలో విజయాలు దక్కడం లేదనే చర్చ తరచూ వినిపిస్తోంది. సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా నటించిన ‘ది వాన్’లో తమన్నా కథానాయికగా కనిపించారు. అడవిలోని తమ కుటుంబ భూమికి సంబంధించిన వివాదం నేపథ్యంలో సొంతూరికి వెళ్లే నాస్తికుడైన వ్యక్తి ఎదుర్కొనే పరిస్థితుల చుట్టూ కథ సాగుతుంది. ఇందులో హీరో భార్యగా తమన్నా నటించారు. అయితే కథ మొత్తం హీరో చుట్టూనే తిరగడంతో ఆమె పాత్రకు పెద్దగా ప్రాధాన్యం లేదనే అభిప్రాయాలు కొందరు విమర్శకుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ‘ది వాన్’లో తమన్నా కనిపించే పాటకు మాత్రం ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోందని తెలుస్తోంది. అయితే కథానాయికగా ఆమె నటనపై పెద్దగా చర్చ జరగడం లేదనే కామెంట్లు వినిపిస్తున్నాయి. దీంతో ఈ సినిమా కూడా తమన్నా బాలీవుడ్ కెరీర్‌లో ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయిందనే చర్చ మొదలైంది. బాలీవుడ్‌లో ప్రత్యేక పాటల విషయంలో మాత్రం తమన్నాకు మంచి ఆదరణ లభించింది. ‘స్త్రీ 2’, ‘రైడ్ 2’ వంటి చిత్రాల్లో ఆమె చేసిన ప్రత్యేక పాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. మరోవైపు ‘లస్ట్ స్టోరీస్ 2’, ‘ప్లాన్ ఎ ప్లాన్ బి’, ‘బబ్లీ బౌన్సర్’ వంటి చిత్రాల్లో కథానాయికగా కనిపించినా.. అవి ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయాయి. ఇప్పుడు ‘ది వాన్’పై వస్తున్న స్పందన నేపథ్యంలో బాలీవుడ్‌లో తమన్నా తదుపరి ప్రాజెక్టులపై ఆసక్తి నెలకొంది.



# ప్రమాదం తర్వాత ఆరో రోజే ‘మండాడి’ షూటింగ్‌కు మహిమా

హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఉద్యమ కెరటం): తమిళంలో ప్రస్తుతం ‘మండాడి’ సినిమా పేరు మార్మోగుతోంది. సూరి హీరోగా నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. తెలుగు నటుడు సుహాస్, సీనియర్ నటుడు సత్యరాజ్ కీలక పాత్రల్లో కనిపించగా.. మహిమా నంబియార్ తన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. సెప్టెంబరు 10న విడుదలైన ఈ చిత్రం కొద్ది రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లోకి చేరింది. ‘మండాడి’ విజయంలో మహిమా నంబియార్ చూపించిన అంకితభావం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సినిమాలోని ‘ఉసురే నీదాన్ పుల్లా’ పాట చిత్రీకరణకు ముందు ఆమె తీవ్ర రోడ్డు ప్రమాదానికి గురయ్యారని దర్శకుడు మతిమారన్ సక్సెస్ మీట్‌లో వెల్లడించారు. ఈ ప్రమాదంలో మహిమా ముఖానికి తీవ్ర గాయాలు కాగా.. 20కి పైగా కుట్లు పడినట్లు ఆయన తెలిపారు. ప్రమాదం తర్వాత మహిమా పరిస్థితిని చూసి తాను కూడా షాక్‌కు గురయ్యానని దర్శకుడు చెప్పుకొచ్చారు. అలాంటి సమయంలో ఆమెను షూటింగ్‌కు రావాలని అడగడం కూడా తనకు ఇబ్బందిగా అనిపించిందన్నారు. అయితే సినిమాలో కీలకమైన పాట చిత్రీకరణ జరగాల్సి ఉండటంతో మహిమా ధైర్యంగా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీ జరిగిన కేవలం ఆరో రోజుకే ఆమె తిరిగి సెట్స్‌లో అడుగుపెట్టారని మతిమారన్ వెల్లడించారు. ‘మండాడి’లోని పాత్ర కోసం మహిమా శారీరకంగానే కాకుండా మానసికంగానూ ఎంతో కష్టపడ్డారని దర్శకుడు ప్రశంసించారు. సినిమాలోని కొన్ని భావోద్వేగ సన్నివేశాలు తనను వ్యక్తిగతంగా కూడా ప్రభావితం చేశాయని మహిమా గతంలో చెప్పినట్లు తెలుస్తోంది. కథ, నటీనటుల ప్రదర్శన, దర్శకుడి తెరకెక్కించిన విధానంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.111.80 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాల లెక్కలు చెబుతున్నాయి.

# ‘కల్కి 2’ షూటింగ్‌కు రంగం సిద్ధం

హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఉద్యమ కెరటం): పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం ‘స్పిరిట్’, ‘ఫౌజీ’ చిత్రాలతో బిజీగా ఉన్నప్పటికీ.. ‘కల్కి 2898 ఏడీ’ సీక్వెల్ ‘కల్కి 2’పై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వచ్చేనెల నుంచి ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ వేగం పుంజుకోనున్నట్లు సమాచారం. కొత్త షెడ్యూల్‌లో ప్రభాస్‌తో పాటు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె తదితర కీలక నటీనటులు పాల్గొననున్నట్లు తెలుస్తోంది. తొలి భాగం ముగింపులో ఇచ్చిన భారీ హైప్‌కు కొనసాగింపుగా రెండో భాగంలో కథ మరింత ఆసక్తికరంగా ఉండబోతుందని అభిమానులు భావిస్తున్నారు. 2024లో విడుదలైన ‘కల్కి 2898 ఏడీ’ ప్రపంచవ్యాప్తంగా భారీ విజయాన్ని అందుకుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు నాగ్ అశ్విన్ రెండో భాగాన్ని మరింత భారీ స్థాయిలో తెరకెక్కించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. అధునాతన దృశ్య ప్రభావాలు, భారీ నిర్మాణ విలువలతో రూపొందనున్న ఈ చిత్ర షూటింగ్‌ను 2027 ప్రథమార్ధంలో పూర్తి చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. తొలి భాగంలో మిగిలిపోయిన ప్రశ్నలకు సమాధానాలతో పాటు మహాభారత కాలానికి సంబంధించిన కీలక ఘట్టాలు, కలియుగం నేపథ్యంలో జరిగే పరిణామాలను ‘కల్కి 2’లో మరింత గ్రాండ్‌గా చూపించనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రేక్షకుల్లోనూ ఈ సీక్వెల్‌పై భారీ ఆసక్తి నెలకొంది.






# 31 ఏళ్లకే విషాదాంతం.. ఆర్తి అగర్వాల్ జీవితం



హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఉద్యమ కెరటం): తెలుగు సినీ పరిశ్రమలో అనతికాలంలోనే అగ్ర కథానాయికగా ఎదిగిన అందాల తార ఆర్తి అగర్వాల్. స్టార్ హీరోల సరసన వరుస అవకాశాలు అందుకుంటూ ఓ వెలుగు వెలిగిన ఆమె జీవితం.. ఆ తర్వాత వ్యక్తిగత సమస్యలు, సినిమాలకు దూరం కావడం, అనారోగ్య పరిస్థితులతో విషాదంగా ముగిసింది. ఆర్తి అగర్వాల్ 14 ఏళ్ల వయసులోనే మోడలింగ్‌లోకి అడుగుపెట్టారు. ముంబయిలో నటనలో శిక్షణ తీసుకున్న ఆమె 2001లో ‘పాగల్‌పన్’ అనే హిందీ చిత్రంతో సినీరంగ ప్రవేశం చేశారు. అదే ఏడాది వెంకటేశ్ హీరోగా కె. విజయభాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన ‘నువ్వు నాకు నచ్చావ్’తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఈ సినిమా ఘన విజయం సాధించడంతో ఆర్తి అగర్వాల్ ఒక్కసారిగా స్టార్ హీరోయిన్‌గా మారారు. ఆ తర్వాత ‘నువ్వు లేక నేను లేను’, ‘అల్లరి రాముడు’, ‘ఇంద్ర’ వంటి చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఉదయ్ కిరణ్, మహేశ్‌బాబు, బాలకృష్ణ, రవితేజ, నాగార్జున, ప్రభాస్ తదితర అగ్ర హీరోల సరసన వరుస అవకాశాలు అందుకున్నారు. అయితే కెరీర్ పీక్‌లో ఉన్న సమయంలో వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు వార్తలు, పుకార్లు ఆమెను ఇబ్బందులకు గురిచేశాయని అప్పట్లో కథనాలు వెలువడ్డాయి. అనంతరం కొంతకాలం సినిమాలకు దూరమయ్యారు. 2007లో ఎన్నారై ఉజ్వల్ నికమ్‌ను వివాహం చేసుకున్న ఆర్తి.. కొంతకాలానికే వైవాహిక జీవితంలో సమస్యలు ఎదుర్కొన్నారని వార్తలు వచ్చాయి. అనంతరం విడాకులు తీసుకుని మళ్లీ సినిమాల్లోకి వచ్చారు. ‘అందాల రాముడు’, ‘గోరింటాకు’, ‘జెంటిల్‌మెన్’ వంటి చిత్రాల్లో నటించారు. అయితే అప్పటికే అవకాశాలు తగ్గడంతో పాటు ఆమె బరువు పెరగడం కూడా కెరీర్‌పై ప్రభావం చూపింది. తిరిగి హీరోయిన్‌గా అవకాశాలు అందుకోవాలనే ప్రయత్నంలో భాగంగా బరువు తగ్గేందుకు ఆర్తి అగర్వాల్ 2015 జూన్ 4న అమెరికాలోని న్యూజెర్సీలో లైపోసక్షన్ చేయించుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం ఇంటికి వెళ్లిన ఆమెకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో గుండెపోటుకు గురయ్యారు. 31 ఏళ్ల వయసులోనే ఆమె కన్నుమూయడం తెలుగు సినీ పరిశ్రమను, అభిమానులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన ఆర్తి అగర్వాల్ జీవితం ఇప్పటికీ అభిమానుల మనసుల్లో చెరగని జ్ఞాపకంగా నిలిచిపోయింది.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN**, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: 9030717172, 9391127717